

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 77 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 8, ఫిబ్రవరి 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# అధికారుల సేవల్లో... అలసత్వం !

## ప్రభుత్వ సేవలను అధికారులు ఆషామాసిగా తీసుకుంటున్నారు



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ అధికారుల సేవలు నిర్లక్ష్యంగా, అలసత్వంగా, కొనసాగుతున్నాయని డాక్టర్ బరిగెల శివ అన్నారు. ప్రభుత్వ అధికారులు కష్టపడి పని చేస్తూ ఇష్టపడి పేరు సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవా పథకాలను ప్రభుత్వ అధికారులు ప్రజలకు చేరవేయడంలో పూర్తిగా అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. పాత ప్రభుత్వ కాలంలోని అన్ని చట్టాలను నెటికీకోనసాగిస్తూ అధికారంలో దుర్వినియోగాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. సామాన్యులను మభ్యపెడుతూ వ్యాపారస్తులను పెంచి పోషిస్తున్నారని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్వతహాగా వ్యాపారస్తులకు సహకరిస్తుండడంలో సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఆధారాలను ఇవ్వాల్సిన సమయాల్లో ఉన్నతాధికారుల పేర్లు ప్రస్తావిస్తున్నారన్నారు. ప్రతి జిల్లాలో ఉన్న అధికారుల మాసవారి సమీక్ష సమావేశాల్లో ప్రోటోకాల్ పాటించకుండా సొంత నిర్ణయాలతో ముందుకు సాగుతూ ఉండడం ప్రభుత్వాధికారులు చేయాల్సిన

- మిగతా 3లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- ముఖ్యమంత్రికి గౌరవం ఇవ్వని మంత్రులు తెలివి అనుకుంటున్నారా.!
- అభివృద్ధిపై ప్రజల విశ్వాసాన్ని బలపరచని అధికారులు
- అధికారత్వంలో విశ్వాసం లేనప్పుడు ప్రజాసేవలో నిజాయితీ ఎలా ఉంటుంది
- రాష్ట్రమంతా రాజకీయ పైరవీలదే హవా
- ప్రజాసేవను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వ అధికారులు
- ప్రభుత్వ సేవ స్పీడుకు అధికారుల సేవలు అడ్డుపడుతున్నాయా!

డాక్టర్ బరిగెల శివ

## యువతకు ఉపాధి కల్పించడమే మా లక్ష్యం : శ్రీధర్ బాబు

రూ.500 కోట్ల పెట్టుబడితో హెచ్ సీ రోబోటిక్స్ విస్తరణ

- ఈ ఏడాది కొత్తగా 500 మందికి.. 3 ఏళ్లలో 2వేల మందికి ఉద్యోగాలు
- ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాలకు ఐటీ కంపెనీలు
- మేం పెట్టుబడులు తీసుకొస్తుంటే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా ఉంటాం.. బకాయిలు చెల్లిస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

వివరాలు 2లో



## కులగణనలో తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలి : మంత్రి పొన్నం

2



## సమస్య సృష్టిస్తే సహించేది లేదు

- వర్గీకరణను అడ్డుకునే కుట్రలు సాగవు
- ఎవనికీ భయపడేది లేదు
- బట్టేబాజ్ మాటలతో జాతిని మోసం చేసేటోన్నికాదు
- న్యాయపరమైన సమస్యలు రాకుండా వర్గీకరణను ముందుకు తీసుకెళ్తున్నాం
- వివాదాలు సృష్టించి అడ్డుకునే వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- వారిని లీగల్‌గా ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు
- ఇప్పటికే ఆలస్యమైంది.. ఇంకా సాగదీసి ఎస్సీలకు అన్యాయం జరగనివ్వను
- శాస్త్రీయంగా స్టడీ చేసి కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది
- కమిషన్ నివేదిక ప్రకారం ముందుకెళ్తా.
- మంత్రి దామోదర రాజ నరసింహ

3



## కాకతీయ యూనివర్సిటీలో సీనియర్ జూనియర్ విద్యార్థుల కొట్లాట

కాకతీయ యూనివర్సిటీలో సీనియర్ విద్యార్థులకు, జూనియర్ విద్యార్థుల మధ్య కొట్లాట జరిగింది, మొదటగా జూనియర్ విద్యార్థులు సీనియర్లను కోపంగా చూస్తున్నారంటూ కాలేజీ మెస్లో జూనియర్ విద్యార్థులను చితకబాదిన సీనియర్లు, సీనియర్లు కొట్టారంటూ, జూనియర్లు అందరూ కలిసి ఒక గ్యాంగ్ గా ఏర్పడి సీనియర్ విద్యార్థులను కొట్టారు, మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకోగా, కొందరు విద్యార్థులకు గాయాలయి సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం.



జై భీమ్ POWER OF PEOPLE

# సంపాదకీయం

## స్మార్ట్ వ్యవసాయంతో అధిక లాభాలు

వ్యవసాయ క్షేత్రంలో నీరుపెట్టాలంటే ఇంటి నుండి లేదా మనం ఎక్కడ ఉన్నా కూడా మోటర్ వేసి నీరు పెట్టవచ్చు. మందు కొట్టాలన్నా మనం ఎక్కడో ఉండి కూడా ఆపరేట్ చేయవచ్చు. ఇలా మన మొబైల్లో సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని డిజిటల్ వ్యవసాయం చేస్తూ అనేక లాభాలను రైతులు అర్జిస్తున్నారు. వివిధ పంటలకు మందులను పిచికారి చేయడం, నీరు కట్టడం, ఔషధాలను వేయడం, వరినాటు నాటడం, కలుపు తీయడం, పాలు పితకడం వంటి వాటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అతి సులభంగా చేస్తున్నారు రైతులు. ప్రపంచంలో నేడు అత్యంత ముఖ్యమైన సమస్య ఆహార సరఫరా. గత 35 ఏళ్లలో జనాభా పెరుగుదల రేటు కంటే ఆహార డిమాండ్ రెండింతలు పెరిగింది. వాస్తవానికి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో దాదాపు 10% లేదా 815 మిలియన్ల మంది ప్రజలు పోషకాహార లోపంతో ఉన్నారు. చురుకైన, ఆరోగ్యకరమైన జీవితాలను గడపడానికి తగినంత ఆహారం లేదు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విస్తృతమైంది. రైతులకు అనేక విధాలుగా సహాయం చేసింది. మెరుగైన సాంకేతికతలను స్వీకరించడం వల్ల పంటల ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది. ఇది ఉత్పత్తి ఖర్చును తగ్గించడంలో కూడా సహాయపడింది. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో ఉపయోగించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది. సాంకేతికత వినియోగం కూడా వ్యవసాయ ప్రక్రియను సులభతరం చేసింది. వ్యవసాయ సాంకేతికత వేల సంవత్సరాల నాటిది. ఏదిఏమైనప్పటికీ మెరుగైన ప్రణాళిక, చురుకైన నిర్వహణ ద్వారా పంట దిగుబడిని పెంచడానికి వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం దీని ప్రాథమిక దృష్టి. మరింత సమర్థవంతమైన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయంలో అధునాతన సాంకేతికత నేటి వ్యవసాయ వ్యాపారంలో రైతులు అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది. యంత్రాలు, ఉపగ్రహ చిత్రాలు లేదా ప్రత్యేక వ్యవసాయ సాఫ్ట్‌వేర్‌తో క్షేత్ర ఉత్పాదకతను పర్యవేక్షించడం వంటి పంట భ్రమణం, కొత్త వ్యవసాయ సాంకేతికతలు వంటి సమయ –పరీక్షా పద్ధతులు వ్యవసాయం సాధ్యతకు దోహదం చేస్తాయి. వ్యవసాయ ఉత్పత్తిని మెరుగుపరిచే విస్తృత పరికరాలు వున్నాయి. వాటిలో వాహనాలు, రోబోటిక్స్, కంప్యూటర్లు, ఉపగ్రహాలు, డ్రోన్లు, మొబైల్ పరికరాలు, సాఫ్ట్‌వేర్ ఉన్నాయి. వ్యవసాయంలో బిగ్‌డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించడం కూడా వ్యవసాయ రంగం సాంకేతిక పురోగతిగా చెప్పవచ్చు. ప్రతి సంవత్సరం కొత్త కొత్త వ్యవసాయ ఆవిష్కరణలు జరుగుతున్నాయి. అగ్రి బిజినెస్ ఆధునీకరించడం, అభివృద్ధి చెందడం కొనసాగిస్తున్నందున, వ్యవసాయ, ఆహార ఉత్పత్తి దారులు, సాంకేతిక నిర్వాహకులు తాజా సాంకేతిక ప్రమాణాలతో రూపొందించడం జరుగుతున్నది. అధునాతన సాంకేతికతలు జంతువుల పెంపకం, సంరక్షణను మెరుగుపరచడానికి, అలాగే వ్యవసాయ నిర్వహణ, మొత్తం ఉత్పాదకతను ఆప్టిమైజ్ చేయడానికి సెన్సార్లు, డేటా, ప్రాసెసింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించడానికి రైతులు ఉత్సాహం చూపుతున్నారు. రిమోట్ మానిటరింగ్ టెక్నాలజీలు గతంలో కంటే జంతువుల ఆరోగ్యం, సంక్షేమంపై మరింత డేటాను అందిస్తాయి. 20 వ శతాబ్దంలో సింథటిక్ ఎరువులు, పురుగుమందుల అభివృద్ధితో సహా వ్యవసాయ సాంకేతికతలలో పెద్ద పురోగతి కనిపించింది. పురుగు మందుల వైమానిక వినియోగానికి భారీ –ఉత్పత్తి ట్రాక్టర్లు, వ్యవసాయ విమానాలతో సహా కొత్త వ్యవసాయ యంత్రాలు ఉన్నాయి. ఇటీవలి పురోగతులలో వ్యవసాయ ప్లాస్టిక్‌లు, జన్యుపరంగామార్పు చెందిన పంటలు, మెరుగైన బిందుసేద్యం, సమీకృత తెగులు నిర్వహణ, హైడ్రోపోనిక్స్, ఆక్వాపోనిక్స్, ఏరోపోనిక్స్ వంటి నేలలేని వ్యవసాయ పద్ధతులు ఉన్నాయి. 21వ శతాబ్దపు మొదటి దశాబ్దాలలో సమాచార సాంకేతికతలు వ్యవసాయానికి ఎక్కువగా వర్తింపజేయబడ్డాయి. ఆధునిక వ్యవసాయ సాంకేతికతలతో పొలాలకు సాధికారత కల్పించడం జరుగుతున్నది. లేజర్ ల్యాండ్ లెవలింగ్, రోబోటిక్ రైతులు, పంటలు, నేలకోసం అధునాతన సెన్సార్లు, ఆప్టిమైజ్డ్ లైట్ మేనేజ్‌మెంట్, ఐసోబుస్ టెక్నాలజీ, ఎఐ ద్వారా వాతావరణం, వాతావరణ అంచనా, డ్రిప్‌లు, మల్చింగ్ వంటి వాటిని విరివిగా వాడుతున్నారు. పంట ఉత్పత్తి ప్రధానంగా భూసార పరీక్ష, నిర్దిష్ట ప్రదేశంలో వాతావరణం ద్వారా నిర్ణయించబడుతుంది. వ్యవసాయ డిజిటలైజేషన్ వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తోంది, పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి వేగం పుంజుకుంది. విజయవంతమైన సాగుచక్రాన్ని నిర్ధారించడానికి వివిధ వాటాదారులు, రైతుల మధ్య సహకారాన్ని ఎనేబుల్ చేయడానికి వ్యవసాయం డిజిటలైజేషన్ అంతర్భాగంగా మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించే రైతులు అధిక దిగుబడి, లాభదాయకతతో సహా గణనీయమైన ప్రయోజనాలను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నారు. సకాలంలో ఖచ్చితమైన సమాచారాన్ని యాక్సెస్ చేయడం ద్వారా వారు మెరుగైన ఫలితాలకు దోహదపడే మరింత ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోగలరు. డిజిటల్ వ్యవసాయం అంటే వ్యవసాయంలో డేటా ఎకోసిస్టమ్‌లు, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటలైజేషన్‌ను ఉపయోగించడం.దీని ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా, స్థిరంగా, సమర్థవంతంగా చేయవచ్చు. డిజిటల్ వ్యవసాయం వల్ల వ్యవసాయ సామర్థ్యం పెరుగుతుంది, దిగుబడులు పెరుగుతాయి, పర్యావరణ ప్రభావం తగ్గుతుంది. వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులను తగ్గించడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం చేయడం, కార్మికుల కొరతను తగ్గించడం, వనరులను సమర్థవంతంగా వినియోగించడం, గ్రామీణాభివృద్ధికి సహాయపడడం వంటివి సాంకేతిక డిజిటల్ వ్యవసాయం లక్ష్యాలుగా చెప్పవచ్చు.

## పారిశుద్ధ్య పనులు ఆకస్మిక తనిఖీ



**కర్నూలు టౌన్, ఫిబ్రవరి 07 (జై భీమ్ న్యూస్):–**

నగరంలోని వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, ఇందిరాగాంధీ నగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను శుక్రవారం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.

## భక్తి ప్రపత్తులతో శ్రీబసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపణం

ఖానాపూర్, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్): నిర్మల్ జిల్లా బైంసా మండలంలోని సుంక్లీ గ్రామంలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితులచే తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇందులో చైర్మన్ బి అశోక్ పటేల్ వైస్ చైర్మన్ డి గంగాధర్ పటేల్, పాపన్న పటేల్, బసవేశ్వర పటేల్, దొడ్డిమీడి శంకర్, తదితరులు ఉన్నారు.

# 'ఉపాధి'కి తీవ్ర నిధుల కొరత

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తీవ్రమైన నిధుల కొరత వెంటాడుతున్నది. 2024– 25 బడ్జెట్లో కేటాయించిన నిధులను విడుదల చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఒక వైపు గ్రామీణ ఉపాధి హామీ పనులకు నిధులు పెంచాలని డిమాండు ఉన్నప్పటికీ అదనంగా నిధులు కేటాయించకపోగా.. గత బడ్జెట్లో పెట్టిన నిధులను కూడా విడుదల చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి ఎలాంటి అదనపు కేటాయింపులు జరగలేదు. ఫలితంగా కార్మికులకు వేతనాల చెల్లింపులు అసాధారణ జాప్యం జరుగుతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ పథకం కింద వేతనాల కోసం రూ. 4315 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అందుకోసం నిధుల బదిలీ ఆదేశాలు (ఎఫ్‌టిఒ) జారీ చేశారు. ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 3(3) ప్రకారం దినసరి వేతనాలను వారానికి ఒకసారి చొప్పున అందజేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలస్యమైనా పని పూర్తయిన తర్వాత పక్షం రోజులు దాటకూడదు. ఉపాధి పథకానికి మెటీరియల్ రూపంలో కేంద్రం తన వాటాగా రూ. 5715 కోట్ల బకాయి పడింది. ఉపాధి పనులకోసం ఉపయోగించే సామగ్రి కొనుగోలుకు అయ్యే వ్యయంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాల్సి ఉంటుంది. కేంద్రం తన వాటాను విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగా భవిష్యత్ ప్రాజెక్టులపై ప్రభావం పడుతుంది. మెటీరియల్ ఖర్చును చెల్లించడంలో జరుగుతున్న నిరంతర జాప్యం ఫలితంగా ముడిసరుకును సరఫరా చేసే స్థానిక సరఫరాదారులు విముకుత చూపుతున్నారు. 2024 సంవత్సరం బడ్జెట్లో ఉపాధి పథకానికి ప్రభుత్వం రూ. 86 వేల కోట్లు కేటాయించింది. అదనంగా నిధులు కేటాయించాలని గ్రామీణాభివృద్ధి శాఖ నుండి పలు విజ్ఞాపనలు వచ్చినప్పటికీ ఆర్థిక శాఖ పట్టించుకోలేదు. పథకానికి తక్కువ నిధులు కేటాయించడం పై విమర్శలు చెలరేగడంతో ప్రభుత్వం స్పందిస్తూ ఇది డిమాండ్‌ను బట్టి నడిచే పథకమని అవసరమైనప్పుడు అదనపు కేటాయింపులు జరుపుతామని తెలిపింది. ఉదాహరణకు 2020– 21 ఆర్థిక సంవత్సరంలో.. అంటే కోవిడ్ సమయంలో కార్మికులు పెద్ద సంఖ్యలో నగరాల నుండి స్వస్థలాల బాటపట్టారు. ఆ సమయంలో ప్రభుత్వం పథకానికి కేటాయింపును రూ. 61,500 కోట్ల నుండి రూ.1,11,500 కోట్లకు పెంచింది. ఆ తర్వాత తగ్గిస్తూ వస్తుంది. బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండటంతో కృత్రిమంగా డిమాండు తగ్గుతుందని పథకాన్ని నిశితంగా పరిశీలిస్తున్న నిపుణులు, హక్కుల కార్యకర్తలు, ప్రజా సంఘాలు పూర్తిస్థాయి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచడం లేదు. వేతనాలు పెంచాలని కోరుతూ విజ్ఞప్తులు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ గత ప్రభుత్వంలో వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె చేసిన 7,500 మంది ఫీల్ అసిస్టెంట్‌లను ఉద్యోగాల నుంచి తొలగించింది. తిరిగి రెండున్నర సంవత్సరాల తర్వాత 2023 ఎన్నికల ముందు తిరిగి వారిని పనిలోనికి తీసుకున్నారు. కానీ వేతనాలు పెంచలేదు. రాష్ట్రంలో ఉపాధి హామీ స్కీంలో రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్స్ మొదలగువారు పని చేయుచున్నారు. వీరికి నవంబర్ నెల నుంచి జీతాలు రావడం లేదు. ఈ స్కీమ్‌లో గత 18 సంవత్సరాల నుంచి పని చేస్తున్నప్పటికీ కనీస వేతన విధానం, పే స్కేలు లేదు. వీరిలో చాలామంది రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నారు. ఈ మధ్యకాలంలో కొంతమంది చనిపోయారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నప్పటికీ మాకు గుర్తింపు లేదని, నెలకు జీతాలు రాక, అప్పులతో ఆత్మహత్యలు కూడా చేసుకున్న వారు ఉన్నారని సిబ్బంది ఆందోళన వెలిబుచ్చుతున్నారు. మొదటిసారిగా 2016 వేతనాలు పెంచినారని ప్రస్తుతం ఫీల్ అసిస్టెంట్స్‌కు రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని.. అది గత మూడు నెలలుగా వేతనాలు అందలేదని తెలుపుతున్నారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఉపాధి హామీ ఉద్యోగులు 606 మండలాల్లోని ఎంపిడిఒలకు వినతి పత్రాలు సమర్పించారు. పెండింగ్ వేతనాలతో పాటు వేతన సవరణ, పే స్కేల్స్ ఇవ్వాలని కోరుతూ ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం ఐకాస ప్రకటించింది. ఉపాధి హామీ పనులలో మెటీరియల్ కాంపోనెంటుకు 40 శాతం, లేబర్ కాంపోనెంట్‌కు 60 శాతం కేటాయిస్తూ, మెటీరియల్ కాంపోనెంటులో 5 శాతం ఉద్యోగుల వేతనాలకు కేటాయిస్తున్నారు. 10 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సింది, కేంద్రం నుంచి వచ్చే నిధులు సకాలంలో విడుదల కాకపోవటంతో పనులు పూర్తిగా కాకపోవడం.. అందులో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు సకాలంలో ఇవ్వలేకపోతున్నామని గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రకటిస్తుంది.



## యువతకు ఉపాధి కల్పించడమే మా లక్ష్యం : శ్రీధర్ బాబు

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించి, తెలంగాణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాష్ట్రం లో మరో రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సెంటిలియాన్ నెట్ వర్క్స్ కు చెందిన హెచ్ సీ రోబోటిక్స్ ముందుకొచ్చినట్లు వివరించారు. ఆ వివరాలను శుక్రవారం కంపెనీ ప్రతినిధులతో కలిసి సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. "హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా సెంటిలియాన్ నెట్ వర్క్స్, హెచ్ సీ రోబోటిక్స్ తొమ్మిది దేశాల్లో డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ సాఫ్ట్ వేర్, టెలి కమ్యూనికేషన్, రోబోటిక్స్, విమాన రక్షణకు సంబంధించిన సాఫ్ట్ వేర్ అభివృద్ధితో పాటు పలు రంగాల్లో సేవలు అందిస్తూ.. 2వేల మందికి ఉపాధి కల్పిస్తుంది. తాజాగా మరో రూ.500 కోట్లు పెట్టేందుకు ముందుకొచ్చారు. ఫలితంగా ఈ ఏడాది 500 మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయి. ఈ సంఖ్య మూడేళ్ల లో 2వేలకు చేరుతుంది" అని అన్నారు. " ఇప్పటీ వరకు ఐటీ రంగంలో పెట్టుబడులన్నీ హైదరాబాద్ కే పరిమితమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల యువతకు ఉద్యోగాలను కల్పించాలనే సంకల్పంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలని సంకల్పించాం. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఆ దిశగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. సెంటిలియాన్ నెట్ వర్క్స్ సంస్థ ఇప్పటికే తమ కార్యకలాపాలను కరీంనగర్ లో ప్రారంభించింది. మరికొన్ని సంస్థలు కూడా ముందుకొచ్చాయి" అని వివరించారు. "రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా ఉంటాం. వీరికి రావాల్సిన ప్రోత్సాహకాలు రూ.4500 కోట్లు 2016 నుంచి పెండింగ్ లో ఉన్నాయి. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిలను చెల్లించేందుకు చొరవ తీసుకున్నాం. సహేతుక కారణాలు చూపకపోతే గతంలో పరిశ్రమల ఏర్పాటుకు గతంలో కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఇతర అవసరాలకు భూములను వినియోగిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. పరిశ్రమల పునరుద్ధరణకు గతంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ పై ప్రత్యేక అధ్యయనం చేస్తున్నాం. దీని వల్ల పరిశ్రమలకు మేలు జరుగుతుందని భావిస్తే అధిక నిధులు కేటాయించి యథావిధిగా కొనసాగిస్తాం" అని చెప్పారు. "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉంది. గతేడాది దావోస్ లో చేసుకున్న 18 ఒప్పందాల్లో 17 పట్టాలెక్కాయి. 10 ఒప్పందాల పురోగతి 50 శాతం కంటే ఎక్కువగా ఉంది. కేవలం ఒప్పందాలు చేసుకుని రావడమే కాదు.. వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఈ ఏడాది కూడా మేం రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నాం. మేం ఉద్యోగాలను కల్పించేందుకు పాటు పడుతుంటే.. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ పారిశ్రామికవేత్తలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నడూ భూసేకరణ పనులను అడ్డుకోలేదు. రాష్ట్రం అభివృద్ధి గురించి ఆలోచించాం. ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడుతూ అభివృద్ధికి అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నాయి. మాకు రాజకీయాలు కాదు..రాష్ట్రాభివృద్ధే ముఖ్యం. పారిశ్రామికాభివృద్ధికి గత ప్రభుత్వం తీసుకున్న పాలసీలను కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సెంటిలియాన్ నెట్ వర్క్స్ ఛైర్మన్, ఎండీ వెంకట్, డైరెక్టర్ రాధా కిషోర్, ఆ సంస్థ ఇండియా ఆపరేషన్స్ హెడ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ పత్రం దహనం

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):**

నార్నూర్ మండల కేంద్రంలోని స్థానిక డా. అంబెద్కర్ చౌక్ ఎదుట శుక్రవారం బహుజన నాయకులు, మహిళలు కలిసి ఎస్సీ వర్గీకరణ తీర్పు పత్రాన్ని దహనం చేశారు. లోఖండే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి మాల, మహర్ సమాజానికి అన్యాయం చేసిందన్నారు. దీన్ని వారు పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు.

## నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్, పురపాలక ప్రత్యేక అధికారికి సన్మానం

**నిర్మల్, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):**

నిర్మల్ జిల్లా అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ను శుక్రవారం ఏక్తా తెలంగాణ యూత్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లాలోని మూడు పురపాలక సంఘాలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించినందున సన్మానించినట్లు సొసైటీ అధ్యక్షులు శేఖ్ ముజహిద్ తెలిపారు. పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇందులో హబీబ్ జిలానీ, సాజిద్ అల్మాస్, ఫాజిల్ హాష్మీ, అజహర్, ఇమ్రాన్, తదితరులు ఉన్నారు.



## కులగణనలో తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలి : మంత్రి పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 : కులగణనలో ఏ తప్పుల లేవని, ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిసిలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, సబ్‌ప్లాన్, పథకాల రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో పొన్నం మీడియాతో మాట్లాడారు. కులగణన భారత దేశం మొత్తం చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటామా? అని ప్రశ్నించారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలనే డిమాండ్ ఉందని, ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా పూర్తి చేసిందని పొన్నం కొనియాడారు. తెలంగాణ ప్రజలు ఇష్టపూర్వకంగా సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొనలేదని, ఆవహేళన మాత్రం చేశారని ధ్వజమెత్తారు. సర్వేలో పాల్గొన్న వాళ్లకే మాత్రమే కులగణనపై మాట్లాడే అవకాశం ఉంటుందని చురకలంటించారు. బిఆర్ఎస్ నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణన చేయడంలేదని మోడీ ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చిందని, బిజెపి పార్టీ ఫ్యూడలిస్టిక్ పార్టీ అని పొన్నం ధ్వజమెత్తారు.



# అధికారుల సేవల్లో అలసత్వం

మొదటి పేజీ తరువాయి

పని కాదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పేదవాళ్లకు సహాయపడే పనులు చేయాల్సి వస్తున్నప్పుడు అనేకమార్లు కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటూ ప్రజలను విసిగిస్తున్నారన్నారు. పైసా మామూళ్లకు సంబంధించిన పనులలో అత్యంత వేగంగా పూర్తి చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు అన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లో మంత్రులు వేదికలపై సీఎం వస్తుండడాన్ని వశకట్టి కూడా గౌరవాన్ని ఇవ్వకపోవడం తెలితక్కువతనమన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాలతో ప్రభుత్వ అధికారులను చేతుల్లోనికి తీసుకొని వ్యక్తిగత స్వలాభాల కోసం పనిచేయిస్తూ అధికారాన్ని ,ప్రభుత్వాన్ని కుంటి పట్టిస్తుండడం ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారన్నారు. నిజాయితీగా పనిచేస్తున్న అధికారుల పట్ల ప్రజలకు విశ్వాసం పెరుగుతుండగా ఉన్నత అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిల్లతో అలాంటి ఉద్యోగులను వేరే స్థానాలకు బదిలీలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రమంతా ఉద్యోగుల బదిలీలలో ఫోకల్ నాన్ ఫోకల్ స్థానాలలో రాజకీయ నాయకుల ప్రభావంతో ఎక్కువ శాతం అవుకు తోకలు జరిగాయి దానికి సంబంధించి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు జవాబుదారీతనాన్ని ప్రదర్శించకపోవడం మరొక లోటుపాట అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సేవ చేయాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వ పథకాలను పేద స్థాయి ప్రజలకు చేరే విధంగా కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు చేపడుతుండడం ప్రజాసేవకు అద్దం పట్టినట్టుగా కనిపిస్తుండగా ప్రభుత్వ ఉన్నత అధికారులు ప్రజాసేవలను పక్కదారి పట్టించే విధంగా రాజకీయాలకు పాల్పడుతుండడం ప్రజలు గమనిస్తే లేరు అనుకోవడం పచ్చి మూర?త్వమన్నారు. ప్రభుత్వంలోని ప్రధాన శాఖల అధికారులు ప్రభుత్వానికి లోబడీ పనిచేయాలి గాని ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రత్యక్ష పరోక్ష వ్యాపారాలకు సిద్ధపాటు దారులుగా కొనసాగుతూ ఉండడం పట్ల పేద ప్రజలకు సరైన రీతిగా ప్రభుత్వ సేవలు దక్కడం లేదన్నారు. అక్రమ సంపాదన అలవాటు పడుతున్న అధికారులు ప్రభుత్వ ఉన్నతాధికారుల మెప్పుకోసం రాజకీయ సిఫారసులను తీవ్రంగా వాడుకుంటున్నారన్నారు.

# సమస్య సృష్టిస్తే సహించేది లేదు

**వర్గీకరణను అడ్డుకునే కుట్రలు సాగవు**
**ఎవనికీ భయపడేది లేదు**
**బట్టేబాజ్ మాటలతో జాతిని మోసం చేసేటోన్నికాదు**
**న్యాయపరమైన సమస్యలు రాకుండా వర్గీకరణను ముందుకు తీసుకెళ్తున్నాం**
**వివాదాలు సృష్టించి అడ్డుకునే వారికి ప్రజలే బుద్ధి చెబుతారు**
**వారిని లీగల్‌గా ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు**
**ఇప్పటికే ఆలస్యమైంది.. ఇంకా సాగదీసి ఎస్సీలకు అన్యాయం జరగనివ్వను**
**శాస్త్రీయంగా స్టడీ చేసి కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది**
**కమిషన్ నివేదిక ప్రకారం ముందుకెళ్తా.**
**మంత్రి దామోదర రాజ నరసింహ**



హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ కల నెరవేరుతున్న సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహని, హైదరాబాద్‌లోని తన నివాసంలో(మినిస్టర్స్ క్వార్టర్స్) మాదిగ,మాదిగ ఉప కులాల నాయకులు, ప్రజలు కలిసి మంత్రిగారిని ఘనంగా సన్మానించి, ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రితో మాట్లాడారు. మాదిగల సమిష్టి కృషి, సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, సీఎం రేవంత్ రెడ్డిగారి కమిట్‌మెంట్ వల్లే వర్గీకరణ సాధ్యమవుతోంది. వర్గీకరణ కేసు సుప్రీంకోర్టులో దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్నది.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తాం అని ఎన్నికలకు ముందే చెప్పాం.పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే గారే స్వయంగా చేవెళ్ల డిక్లరేషన్‌లో వర్గీకరణపై ప్రకటన చేశారుమీ అందరి ఆశీర్వాదంతో 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చాం.అధికారంలోకి వచ్చిన వెంటనే సుప్రీంకోర్టులో టాప్ మోస్ట్ అడ్వకేట్‌ను ప్రభుత్వం తరపున నియమించి, వర్గీకరణకు అనుకూలంగా వాదింపజేశాం. సీఎం సూచనల మేరకు మాదిగ నాయకులు, మేధావుల బృందాన్ని తీసుకుని నేనే పలుమార్లు ఢిల్లీకి వెళ్లి, విచారణ జరుగుతున్న తీరును పర్యవేక్షించాం.దశాబ్ద కాలానికిపైగా పెండింగ్‌లో ఉన్న కేసులో తీర్పు వచ్చేలా చర్యలు తీసుకున్నాం.ఆగస్టు ఒకటిన వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన వెంటనే,సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తీర్పు వచ్చిన గంటలోపలే వర్గీకరణకు అనుకూలంగా ముఖ్యమంత్రితో అసెంబ్లీలో ప్రప్రకటన చేయించాం.కోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ చేసేందుకు కేబినేట్ సబ్ కమిటీని నియమించి,వర్గీకరణపై కమిటీ పలు మార్లు బేటి అయి.చర్చించాం.చట్టపరమైన సమస్యలు రాకుండా,వన్ మెంబర్ జ్యూడిషల్ కమిషన్ నియమించడం జరిగింది.రిటైర్డ్ జస్టీస్ గారు చైర్మన్‌గా ఉన్న వన్ మ్యాన్ కమిషన్ ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి,అన్ని కులాల సామాజిక, ఆర్థిక,విద్య,ఉద్యోగ పరమైన అంశాలపై స్టడీ చేసింది. సుప్రీంకోర్టు చెప్పిన విధంగాఎంపార్సయల్ ల్ డేటాను సేకరించింది.అలాగే,అన్ని వర్గాల నుంచి ఆఫ్‌లైన్,ఆన్‌లైన్ పద్ధతి ద్వారా రెండు నెలల పాటు వినతులు స్వీకరించింది.సుమారు 8 వేలకుపైగా వినతులను పరిశీలించి, క్రోడీకరించి నివేదిక తయారు చేసింది.ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకుండా, కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన రోజే కేబినేట్ సబ్ కమిటీ ఆమోదించేలా చర్యలు తీసుకున్నాం.ఆలస్యం కావొద్దు, ఇంకా అన్యాయం జరగొద్దు అని మరునాడే కేబినేట్‌లో కమిషన్ రిపోర్ట్‌ను ఆమోదింపజేసుకున్నాం. క్రిమిలేయర్ పెట్టాలన్న కమిషన్ రికమండేషన్‌ను రిజెక్ట్ చేశాం. జనాభా,ఎంపిర్సియల్ డాటా విద్య, ఉద్యోగ రంగాలలో వారి అసమానతల ఆధారంగా మొత్తం 59 కులాలను మూడు గ్రూపులుగా కమిషన్ వర్గీకరించింది.ఆ రికమండేషన్లకు మరునాడే కేబినేట్ ఆమోదం తీసుకుని, అదేనాడు అసెంబ్లీలో సీఎంతో తీర్మానం చేయించుకున్నాం.ప్రత్యక్షంగా, పరోక్షంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు సుమారు 9.8 శాతం రిజర్వేషన్లు సాధించాం.గ్రూప్ వన్‌లో 0.77 శాతం, గ్రూప్ 2లో 9 శాతం వచ్చింది.ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా అన్యాయం జరగొద్దన్న సదుద్దేశంతో వీలైనంత వేగంగా చర్యలు తీసుకున్నాం.కోర్టు కేసులు, లీగల్ సమస్యలు రాకుండా జాగ్రత్తగా వర్గీకరణను ముందుకు తీసుకెళ్లాం. వర్గీకరణ జరగడం ఇష్టంలేని వ్యక్తులు, వర్గీకరణ పేరిట మనుగడ సాగించాలనుకునే వ్యక్తులు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.నాపై వ్యక్తిగత విమర్శలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం.వారిలా చిల్లర మాటలు, బట్టేబాజ్ మాటలు మాట్లాడి జాతిని మోసం చేసే వ్యక్తిని కాదు నేను.నాది ఎవనికీ భయపడే తత్వం కాదు.. వర్గీకరణ చేసి తీరుతాం. అన్నదమ్ముల్లా ఉండాల్సిన మాల, మాదిగల నడుమ వివాదాలు, న్యాయపరమైన చిక్కులు సృష్టించి వర్గీకరణను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారు.వాళ్లను లీగల్‌గా ఎలా ఎదుర్కోవాలో,దశాబ్దాల వర్గీకరణ ఆకాంక్షను ఎలా నెరవేర్చాలో మాకు తెలుసు.సమాజంలో అందరికీ సమాన హక్కులు,సమన్యాయం దక్కాలన్నదే కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్.ఆ కమిట్‌మెంట్‌తోనే సీఎం రేవంత్ రెడ్డి, ఆయన నాయకత్వంలోని మా ప్రభుత్వం ముందుకెళుతున్నది.మాదిగలు ఇంకా డప్పులు కొట్టేకాన్నే ఆగిపోవద్దు.కంప్యూటర్లు పట్టి కోడింగ్ కొట్టాలే.అమెరికా పోవాలె. ఆఫీసర్లు కావాలె.వ్యాపారాలు చేయాలే. ఆత్మగౌరవంతో బతకాలెనే నా ఉద్దేశం ముఖ్య మంత్రి మా పార్టీ ఆకాంక్ష అని పేర్కొన్నారు.

# వడ్ల వీధిలో మిషన్ భగీరథ కొళాయిలు ఒకే దగ్గర 5 బిగించడంపై అధికారుల నిర్లక్ష్యం

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

గద్వాల పట్టణంలోని వడ్ల వీధిలో మిషన్ భగీరథ పథకం కింద తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన కొళాయిలను ఒకే చోట ఐదు వరకు బిగించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొళాయిల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శిస్తున్నారు. ఒకే చోట ఐదు కొళాయిలు.. వృథాగా నీరు మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే, ఇక్కడ మాత్రం ఒకే చోట ఐదు కొళాయిలను ఏర్పాటు చేశారు. దీనివల్ల నీరు వృథాగా పోవడంతోపాటు, ప్రజలకు ఉపయోగకరంగా లేకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యమే కారణం ఈ కొళాయిల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. సరైన ప్రణాళిక లేకుండా, క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే కొళాయిలను ఏర్పాటు చేశారని అంటున్నారు. ప్రజల ఆగ్రహం ఈ విషయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటిని వృథా చేయడం సరికాదని, వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**స్పందించని అధికారులు..**

ఈ సమస్యపై స్థానిక అధికారులు మాత్రం ఇంకా స్పందించలేదు. దీనిపై వారి వివరణ కోసం వేచి చూడాల్సి ఉంది. ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఘటన విరుద్ధంగా ఉంది. వెంటనే దీనిపై చర్యలు తీసుకుని, ప్రజలకు నీటిని సక్రమంగా అందించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



## ఘనంగా విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరై కళాకారులతో కలిసి త్యాగరాజ కీర్తనను ఆలపించిన కలెక్టర్ ప్రావిణ్య**





హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రం ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సంగీత, నృత్య కార్యక్రమాల్ని నిర్వహించారు. త్యాగరాజ ఆరాధన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ముఖ్య అతిథిగా పాల్గొని హైదరాబాద్ నుండి వచ్చిన కళాకారులతో పాటు స్థానిక కళాకారులు, కళాశాల అధ్యాపక బృందంతో కలిసి త్యాగరాజ కీర్తనను ఆలపించారు. అదేవిధంగా హైదరాబాద్ కు చెందిన పలువురు కళాకారులతో పాటు స్థానిక కళాకారులు పలు త్యాగరాజ కీర్తనలు ఆలపించగా కలెక్టర్ తిలకించారు. స్థానిక కళాకారులతో పాటు హైదరాబాద్ కు చెందిన కళాకారులు త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీత అభిమానులను అలరింపజేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలలో పాల్గొన్న కళాకారులందరికీ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అభినందనలు తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాకారులందరికీ స్వర్ణోత్సవ శుభాకాంక్షలను కలెక్టర్ తెలియజేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ నాడ్గొడ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో కళాశాల అధ్యాపకులు భాస్కర్, అనుముల యోష , హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్, తదితరులతోపాటు కళాకారులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

## గురువు కానిస్టేబుల్... శిష్యురాలు ఎస్ఐ.. ఒకే స్టేషన్‌లో ఉద్యోగాలు

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

ఈ చిత్రంలో ఎస్సైగా యూనిఫాంలో ఉన్న యువతి పేరు జబీనాబేగం. పక్కన నిలబడింది అదే స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న లాల్యానాయక్. ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా? వీళ్లిద్దరూ గురుశిష్యులు కావడం, ఆయన వద్ద పాఠాలు నేర్చుకున్న విద్యార్థిని ఎస్సైగా.. తాను కానిస్టేబుల్ గా పనిచేసే స్టేషన్ కి రావడం ఇందులో ప్రత్యేకత. ఇద్దరూ పేదరికం అనే అడ్డంకులను దాటుకుని ఆయా స్థానాలకు చేరుకోవడం మరింత ప్రత్యేకం. వికారాబాద్ జిల్లా పరిగి మండలం చౌదరిగూడ గ్రామానికి చెందిన ప్రభావత్ లాల్యానాయక్ నిరుపేద కుటుంబం. తండ్రి నాలుగో తరగతిలో పరిగిలోని ప్రభుత్వ వసతి గృహంలో చేర్పించడంతో అక్కడే ఉంటూ ఇంటర్ పూర్తిచేశారు. తర్వాత పాల్వంచలో డిగ్రీ పూర్తిచేసిన ఆయన..ఎంఏ, బీఎడ్ పూర్తిచేసి పరిగిలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో లెక్చరర్ గా చేరారు. కొవిడ్ సమయంలో కళాశాల మూతపడటంతో ఉపాధి కోల్పోయారు. పట్టుదలతో పోటీ పరీక్షలకు సిద్ధమై..2020లో కానిస్టేబుల్ గా ఎంపికయ్యారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీసుస్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. లాల్యానాయక్ లెక్చరర్ గా పనిచేస్తున్న సమయంలో నిరుపేద కుటుంబ నేపథ్యం ఉన్న అదే జిల్లాలోని మక్తా వెంకటాపూర్ గ్రామానికి చెందిన జబీనాబేగం ఇంటర్ లో చేరారు. చదువులో చురుగ్గా ఉండటంతో లాల్యానాయక్ ఆమెను ప్రోత్సహించారు. ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఆమెకు వివాహం జరిపించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుసుకుని.. వారితో మాట్లాడి రద్దు చేయించారు. ఇంటర్ తోపాటు డిగ్రీ చదివేవరకు అండగా నిలిచారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకూ చేదోడుగా ఉన్నారు. గురువు ప్రోత్సాహానికి స్వయం కృషిని జోడించిన జబీనాబేగం 2024లో ఎస్సై పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఏడాది శిక్షణ పూర్తి చేసుకుని ఎస్సైగా (ప్రొబేషన్) మొయినాబాద్ పోలీసుస్టేషన్ లో పోస్టింగ్ పొందారు. తన శిష్యురాలు బుధవారం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించేందుకు వస్తున్నట్టు తెలుసుకున్న లాల్యానాయక్.. జబీనాబేగంకు ప్రధాన ద్వారం వద్ద సెల్యూట్ చేసి స్వాగతం పలికారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# తెలంగాణలోని పాఠశాలలో వాటర్ బెల్

**రాజన్న జిల్లా జై భీమ్ న్యూస్**

వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో మొట్టమొదటి సారిగా ఒడిశా రాష్ట్ర విద్యాశాఖ అన్ని పాఠశాలలో ఇకపై వాటర్ బెల్ కూడా ఉండా లని ఒడిశా విద్యాశాఖ నిర్ణయించింది, విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాల ప్రకారం పాఠశాల సమయములో మూడుసార్లు వాటర్ బెల్ మోగాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా తెలంగాణలో కూడా విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఆ స్కూల్ హెడ్ మాస్టర్ సహా స్టాఫ్ అంతా కలిసి పిల్లలకు వాటర్ బెల్ ఉండాలని,ఈ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెల బడిలో నీటి గంటలు వినిపించే సాంప్రదాయానికి ఆ స్కూల్ శ్రీకారం చుట్టింది. అనారోగ్య సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు తమవంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు. సాధారణంగా ఉపాధ్యాయులు వచ్చామా.. పాఠాలు చెప్పామా.. వెళ్లామా అన్నట్టు ఉంటారు. కానీ ఇక్కడ ఉపాధ్యాయులు మాత్రం అలా కాదు. విద్యాతో పాటు వారి ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వాటర్ తాగ కపోతే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని తెలుసు. అందుకే అలాంటి సమస్యలకు చెక్ పెట్టేందు కు వాటర్ తాగిస్తున్నారు. పిల్లలు ఇంట్లో కంటే ఎక్కువ సమయం స్కూల్లో గడుపుతుంటారు. అందుకే వారితో ఎక్కువ వాటర్ తాగించాలనే ఉద్దేశంతో స్కూల్లో వాటర్ బెల్ పెట్టారు. ప్రతీ విద్యార్థి ఇంటి నుంచి స్కూలుకి వచ్చి తిరిగి ఇంటికి చేరే వరకు కనీసం 1 లీటర్ నీరు తాగాలని రూల్ పెట్టారు. అందుకు అవసరమైన చొరవ తీసుకుంటూ కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందులో భాగంగా రోజుకు రెండు సార్లు వాటర్ బెల్స్ మోగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ సమయంలో తరగతి గదుల్లో ఉన్న విద్యార్థు లంతా కూడా పాఠశాల ఆవరణలోకి వచ్చి నీటిని తాగాల్సి ఉంటుంది. వీరితో పాటు స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా నీరు తాగుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలందించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**



**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ విసి సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షకులతో సమావేశమై ఆసుపత్రుల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలోకి నర్సంపేట వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రి విలీనం చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. నర్సంపేట టి హబ్ లో వైద్య పరీక్షల నిర్వహణ సక్రమంగా లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, నిర్లక్ష్యాన్ని వీడి, వైద్య పరీక్షలు చేసిన వెంటనే రిపోర్ట్ లు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమర్ధవంతంగా వైద్యసేవలు అందేలా నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపడాలని, రోగుల సంఖ్య పెరగాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్,పర్యవేక్షకులు స్వామి, ప్రొఫెసర్ కిషన్, డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల పనితీరు మెరుగుపడాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరు మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాళ్లతో కలెక్టరేట్లో బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఇటీవల తాను (కలెక్టర్) స్వయంగా తనిఖీ చేసిన వసతి గృహాలు, జిల్లా ఉన్నతాధికారులు, మండల ప్రత్యేకాధికారులు హాస్టళ్లను తనిఖీ చేసిన సమయంలో గమనించిన లోటుపాట్లను ప్రస్తావిస్తూ వాటిని చక్కదిద్దుకోవాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల పట్ల తమ స్వంత పిల్లల్లా శ్రద్ధ వహిస్తూ, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యాబోధన, సరైన వసతి సదుపాయాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆదివారం మెనులో విద్యార్థులకు అందించే భోజనం ఫోటోలు గూగుల్ షీట్ లో పంపాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీ చేపటడతామని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.





# సంస్కృతి 25 బ్రోచర్ ఆవిష్కరణ

**కిట్స్‌లో జాతీయ స్థాయి స్టూడెంట్ కల్చరల్ కార్నివాల్ సంస్కృతి 25 వినోదం, ఉత్సాహభరితంగా ప్రారంభోత్సవం**

**విద్యార్థి లోకంలో ఒత్తిడిని నిర్మూలించి ఆనందాన్ని నింపడమే కల్చరల్ ఫెస్ట్ ముఖ్య ఉద్దేశ్యమని ముఖ్య అతిథిగా తెలంగాణకు చెందిన సినీ దర్శకుడు వెంకీ అట్లూరి వెల్లడి**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ప్రారంభోత్సవం సందర్భంగా "సంస్కృతి'25పై షార్ట్ ఫిల్మ్‌ను విడుదల చేసి, రెండు రోజుల సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్‌ను ముఖ్య అతిథి ఆవిష్కరించారు. మ్యూజిక్ డ్యాన్స్, ఫైన్ ఆర్ట్స్ (ఎండిఎఫ్) క్లబ్ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, వరంగల్ (కిట్స్ డబ్ల్యు)వారు "సంస్కృతి '25" అనే పేరుతో జాతీయ స్థాయి సాంస్కృతిక కార్నివాల్‌ను 2025 ఫిబ్రవరి 7-8 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తోందని, "సంస్కృతి'25" ప్రారంభ వేడుకలు ఆడిటోరియం కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో జరిగాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా తెలంగాణకు చెందిన సినీ దర్శకుడు వెంకీ అట్లూరి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి, హైదరాబాద్‌కు చెందిన సినీ దర్శకులు వెంకీ అట్లూరి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ, రెండు రోజుల సాంస్కృతిక ఉత్సవాల్లో వారి భవిష్యత్తును నిర్ణయించే అంశాలకు ఇది ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రఖ్యాత సినీ దర్శకుడవ్వాలనేది నా ఆశయం, లక్ష్యం. మీరు మీ లక్ష్యాన్ని ఛేదించే వరకు అంకితమైన కృషితో మీ ఆత్మగౌరవానికి కట్టుబడి ఉండండి. నా దర్శకత్వంలో లక్కీ భాస్కర్, గ్నపకం, ఇట్స్ మై లవ్ స్టోరీ, కేరింత, తొలిప్రేమ, స్నేహగీతం, సర్, మిస్టర్ మజ్ను వంటి పది సినిమాలు వచ్చాయి. విద్యార్థులు పాల్గొనడం చాలా ఉత్సాహభరితమైన మార్గం మరియు యువ వర్ధమాన ఇంజనీర్‌లలో చాలా జోష్‌ను సృష్టించింది. సాంస్కృతిక ఉత్సవం యొక్క ప్రధాన లక్ష్యం ప్రధానంగా వినోదం, ఆనందం, విద్యార్థి సంఘంలో నాయకత్వం, నిర్వహణ నైపుణ్యాలను పెంపొందించడం. కిట్స్ వరంగల్ లోని 11 విద్యార్థి కార్యాచరణ క్లబ్‌ల అద్భుతమైన పనితీరును ఆయన అభినందించారు.మీ జీవితంలో విజయం సాధించడానికి వాస్తవికత మరియు వైఖరి రెండు స్తంభాలు అని, మీ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నించడం ఆపవద్దు అని అతను ముగించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే, కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్ విద్యార్థులు సంగీతం వినడం, పుస్తక పఠనం, తెలుగు సాహిత్యంపై దృష్టి పెట్టడం, చారిత్రక సినిమాలు చూడటం వంటి అభిరుచులను అలవర్చుకోవాలి. సానుకూల దృక్పథం, మానవ ఆలోచన నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. మీ కలలను నిజం చేసుకోండి. ఆరోగ్యవంతమైన సమాజానికి విద్యార్థుల చురుకైన ప్రమేయం అవసరమని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సంఘంలో నాయకత్వ, నిర్వహణా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, విద్యార్థులు సాంస్కృతిక వైవిధ్య ప్రపంచానికి రవాణా చేయబడతారని సంస్కృతి హామీ ఇస్తుంది, అక్కడ వారు విభిన్న సంప్రదాయాలు, వంటకాలు, జీవనశైలి యొక్క గొప్పతనాన్ని అనుభవిస్తారు. సంస్కృతీ ఈవెంట్ యొక్క రెండు రోజుల్లో, మొదటి రోజు పాశ్చాత్య రోజు, రెండవ రోజు సాంప్రదాయ బీట్స్, లైవ్ బ్యాండ్ షోలు ఇందులో ప్రముఖ గాయకులు ఉన్నారు. లైవ్ పెయింటింగ్, టాటూస్, ఫోటోబూత్, ఫేస్ పెయింటింగ్, పాట్ మేకింగ్, కన్ఫెషన్స్ వంటి 20కి పైగా స్పాట్ ఈవెంట్‌లు వివిధ ఐదు వేదికలయిన, సివిల్ సెమినార్ హాల్, న్యూ సెమినార్ హాల్, సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్, మెచ్. సెమినార్ హాల్, ఆడిటోరియంలో జరిగాయి. యువ మనస్సులను తేలికపరచడానికి వినోదం, ఉత్సాహం, అభిరుచితో అనుసంధానం చేయడానికి ఇది ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్, ఏకశిలా ఎడ్యుకేషన్ సొసైటీ(ఈఈఎస్), రిటైర్డ్ జడ్జి కె. దేవీ ప్రసాద్ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షోపన్యాసం చేశారు. విద్యార్థులు నృత్యం, నాటకం, సంగీతం, గానం రూపంలో తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా యువ మనస్సుల సృజనాత్మకతకు సాక్షులుగా ఉంటారు. అన్ని కార్యకలాపాలు విద్యార్థి సంఘం యొక్క సమగ్ర అభివృద్ధికి దారితీస్తాయి. కిట్స్ వరంగల్ నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మా విద్యార్థులను సాంకేతికంగా ఉన్నతంగా, నైతికంగా బలంగా చేయడానికి ప్రయత్నిస్తుంది అని అతను ముగించారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఫార్మర్ ఎంపీ, కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు, కిట్స్ వరంగల్ కోశాధికారి పి.నారాయణ రెడ్డి హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే, కిట్స్‌డబ్ల్యు అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్, పాలకమండలి సభ్యులు, ఏకశిలా ఎడ్యుకేషన్ సొసైటీ (ఈఈఎస్) సభ్యులు ఇ.వెంకట్రామ్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందులకు అధ్యాపకులను, విద్యార్థిని విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ పాలకమండలి సభ్యులు, ఏకశిలా ఎడ్యుకేషన్ సొసైటీ (ఈఈఎస్) సభ్యులు ఇ.వెంకట్రామ్ రెడ్డి, చీఫ్ ప్యాట్రన్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి, చైర్ పర్సన్ సంస్కృతి 25, డీన్ విద్యార్థి వ్యవహారాలు, ప్రొఫెసర్ ఎం. శ్రీలత, సంస్కృతి 25 కన్వీనర్, అసోసియేట్ డీన్ విద్యార్థి వ్యవహారాలు, ఈఈఈ అసోసియేట్ ప్రొఫెసర్, యం. నర్సింహారావు, వివిధ విభాగాల డీన్‌లు, వివిధ విభాగాల విభాగాధిపతులు, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, ఫిఆర్ఓ, డాక్టర్ డి. ప్రభాకరా చారి, పబ్లిక్ రిలేషన్స్ ఎండి ఎఫ్ క్లబ్, పి. రక్షిత్, ఎండి ఎఫ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి హెచ్. శ్రీగౌరీ జాహ్నవి, స్టూడెంట్ కో ఆర్డినేటర్ సంస్కృతి'25, యమ్. సాకేత్, వివిధ క్లబ్‌ల ప్రధాన కార్యదర్శులు, సంస్కృతి 25 విద్యార్థి ప్రతినిధులు, కిరిల్ ప్రవర్ష్, ఆసిఫ్ అబూబకర్, నయన, మరియం యాస్మీన్, సుఫియాన్, వనలక్ష్మి, అనిరుధ్, రియాన్, శశి, రాహుల్, రిషిత్, స్నేహ, స్నేహాంకిత, పాటు డిస్కో క్లబ్, పిఎం క్లబ్, సాక్ సభ్యులు, విద్యార్థి ప్రతినిధులు, అధ్యాపక సభ్యులు, సిబ్బంది, 3000 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు హాజరు కానున్నారు.





# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కవి సమ సమాజ నిర్మాత సంత్ రవి దాస్ జయంతి

**సత్యసాయి జిల్లా జై భీమ్ న్యూస్ :**

హిందూపురం పట్టణంలోని రోడ్డు భవనాలశాఖా కార్యాలయంలోని బంగ్లాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంత్ రవి దాస్ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్లిం నగారా మరియు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ సామాజిక సామరస్యాన్ని ఆచరించిన మహనీయుడు సంత్ రవిదాస్ అని సమాజంలో కులం పేరుతో అసమానతలు, అంటరానితనం తీవ్రంగా వున్న కాల%శీ%లో జన్మించిన రవిదాస్ రాబోయే కాలానికి దిశా నిర్దేశం చేషారు. అలాంటి వారిలో రవిదాస్ ఒకరు. అందుకే ఆయన అనుయాయిలు ఆయన బంగారు విగ్రహాన్ని జలందర్ నుంచి కాశీ వరకూ మోసుకొచ్చారు. ఇప్పుడు ఆయన ప్రభావం పంజాబ్ నుంచి దేశమంతా విస్తరించింది. సంత్ రవిదాస్ భక్తి కవుల్లో ఒక ఆధ్యాత్మిక భావాన్నే కాకుండా సామాజిక భావాలనూ అభివృద్ధి చేశారు. బానిస భావాలను వ్యతిరేకించారు. మానసిక బానిసత్వాన్ని , కుల బానిసత్వాన్ని , శారీరక బానిసత్వాన్ని వ్యతిరేకించాడు. మనిషి స్వతంత్రుడై గౌరవమైన ఆలోచనలతో జీవించాలని, తలవంచి జీవించడాన్ని నిరాకరించాడు. ప్రతి మనిషిలోని చైతన్యాన్ని ఆయన ఉద్దీపింపచేశాడు. మానవతాపూర్ణంగా మనిషి ఉండాలని తన కవిత్వంతో, తన పాటతో చాటారు. సమాజాన్ని మేల్కొలిపే బాటలో పయనించారు. సంత్ రవిదాస్ క్రీ.శ. 1377లో కాశీవద్ద సీర్ గోవర్ధనపురం అనే గ్రామంలో, మాఘపూర్ణిమ రోజున చర్మకార కుటుంబంలో జన్మించారు. కలసాదేవి, సంతోఖ్‌దాస్ తల్లిదండ్రులు. రవిదాస్, కబీర్‌కు సమకాలీకుడని చరిత్రకారులు తేల్చారు. ఆయన ఆధ్యాత్మిక చైతన్య కవి గా అంటరానివారి కోసం ఉద్యమాన్ని నడిపారు. వారి సాంఘిక విముక్తి కోసం కృషిచేశారు. ఆయన పదాలు బనారస్ దాటి ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌ల వరకూ ప్రవహించాయి. కవిగా, ఒక ఎదిగి ఆయన చేసిన పోరాటం ఈనాటి సమాజానికి ఒక స్ఫూర్తి. ఆయన కవితల్లో అతి సున్నితంగా సందేశం, శాంతి సమానతలు ప్రజల ఆలోచనల్లో అద్భుతమైన ప్రభావం చూపుతాయి. రవిదాస్ జీవితాంతం తన చర్మకార వృత్తిని అవలంబిస్తూనే అత్యంత నిరాడంబరంగా బతికారు. చిత్తోడ్ రాజు రాణా సంగా, రాణిఝాలీ దేవిల అభ్యర్థన మేరకు రవిదాస్ దంపతులు చిత్తోడ్ వెళ్లారు. వీరికి అక్కడ రాజమర్యాదలతో స్వాగతం లభించింది. మహారాజు వద్ద అతిథిగా కొంతకాలం అక్కడే ఉన్నారు. సమానో మంత్రం అనే వేదసారమంతా రవిదాస్ పదాలలో ఉంది. "ఐసా బహురాజ్ మై జహెూ మిలైసబన్ కో అన్న్ చోట్ బడో సబ్ సమ్ బసై రైదాస్ రహె ప్రసన్న్ " %-% ( ఎక్కడైతే అందరికీ భోజనం లభిస్తుందో, ఎవరూ ఆకలితో నిద్రపోరో.. ఎక్కడ ఎక్కువ తక్కువుల అసమానతలు లేకుండా ప్రజలు జీవిస్తూ ఉంటారో.. అలాంటి సమాజాన్ని, అలాంటి పాలనా వ్యవస్థని రవిదాస్ కోరుకుంటున్నారు "కులం గురించి ఎవరూ, ఎవర్నీ అడగ కూడదు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అందరూ మనిషి కులానికి చెందినవారే. మానవత్వమే పరమ ధర్మం" అని ఆయన బోధించారు. ఆయన చెప్పే ప్రతి మాటా అనుభవం నుంచి, అధ్యయనం నుంచి, అవగాహన నుంచి మానవతావాదం నుంచి పుట్టుకొచ్చాయి. " నా కులం చమార్. ప్రజలు దాన్ని తక్కువగా చూస్తున్నారు. మా జాతి చనిపో యిన జంతువులను ఊరికి దూరంగా మోసుకెళ్లి పర్యావరణం దెబ్బతినకుండా చూస్తూ ఉంది. మంచి గాలిని సమాజానికి ప్రసాదిస్తూ , సమాజ హితానికి తోడ్పడుతోంది" అని చాటారు. జాతి వైతాళికులైన అంబేద్కర్ లాంటి వారిపై రవిదాస్, కవుల ప్రభావం ఉంది. రవిదాస్ ఒక వ్యక్తి కాదు. ఉద్యమం. సామాజిక సమరసత కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ ఒక ఉత్తేజం. పదవుల లాలసతో నేటి విభజన, విద్వేష రాజకీయాలు గ్రామీణ ప్రజా జీవితాల్ని విచ్ఛిన్నం చేస్తున్న తరుణంలో సంత్ రవిదాస్ బోధనలు, జీవితం విస్తృత ప్రచారం చేయాలి. సామాజిక సమరసతను నిర్మాణం చేసి సామూహిక ప్రజా జీవితాలలో శాంతిని నింపాలి.అని అన్నారు, ఈ కార్యక్రమంలో బుద్దిస్ట్ కల్చరల్ ఇండీవర్.సుబ్బారాయుడు బహుజన సమాజ్. శ్రీరాములు టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం షేక్ షబ్బీర్ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రవికుమార్. నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మూర్తి. హ్యూమనిజం అధ్యక్షుడు అజమతుల్లా ఖాన్.ఆసీఫ్. కుల వివక్ష పోరాట సమితి రమణ తదితరులు పాల్గొని గులాబీ పువ్వులతో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.




# ఉప్పల్‌లో పీడీఎస్ బియ్యం పట్టివేత

ఉప్పల్ :ఉప్పల్ పరిసరాలు ప్రాంతంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం కలిగిన వాహనాలను శుక్రవారం పోలీసులు సీజ్ చేశారు. డ్రైవర్ వెంకట్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఒక డీసీఎం వాహనం, రెండు మిని ట్రక్కులు, వాహనంలోని ఆరు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ షాపుల్లో బియ్యాన్ని కొనుగోలు చేసి బయట అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించారు.

# మాదిగ అమరులకు పాలాభివందనం



వారి తల్లిదండ్రులకు పాదాభివందనం

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు వర్గీకరణ విజయాన్ని అంకితం ఇస్తూ ... వారి కుటుంబ సభ్యులను మాజీ రాష్ట్ర మంత్రివర్యులు మోత్కుపల్లి నరసింహులు మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్మెస్ఎఫ్) మాజీ జాతీయ అధ్యక్షులు టిఎస్ జేఏసీ ఓయూ జెఏసి చైర్మన్ రుద్రవరం లింగస్వామి మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లా వెంకట్ మాదిగలు పొన్నాల సురేందర్ మాదిగ మహేష్ మాదిగల తల్లిదండ్రుల పాదాలను పాదాభివందనం చేశారు అమరవీరుల విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘన నివాళి అర్పించారు. వర్గీకరణ పోరాటంలో గాంధీభవన్ ఘటనలో 2009న సురేందర్ మాదిగ,మహేష్ మాదిగ, దామోదర్ మాదిగలు వర్గీకరణ జరగాలి ఆ ఫలాలు మాదిగ మాదిగ కులాలు అనుభవించాలని ఏకైక లక్ష్యంతో వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా యుద్ధంలో నేలకొరిగారు. వారి త్యాగ ఫలితమే నేటి వర్గీకరణ అని మోత్కుపల్లి నరసింహులు కీర్తించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ 1.మాది అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని 2. పక్కా ఇండ్లు కట్టివ్వాలని 3.మాదిగల అమరవీరుల స్మృతి వనాన్ని హైదరాబాద్ ప్రత్యేకమైన స్థలంలో నిర్మించాలని 4.ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అనేకమంది ఉద్యమకారుల పైన ఉన్నటువంటి కేసులను అన్నింటిని వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో మాది అమరవీరుల కుటుంబాలను ఆదుకునే విధంగా మాదిగ యువకులు,ఉద్యోగులు మాదిగ రాజకీయ నాయకులు వారి కుటుంబానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంత్ ఆచారి కి అమరత్వానికి ఎంత ప్రాధాన్యత ఉందో మాదిగ దండోరా ఉద్యమంలో సురేందర్ మాదిగ ప్రాణత్యాగానికి అంతే విలువ ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.వీరి కుటుంబాలను చూస్తుంటే బాదేస్తుందని చేతికి వచ్చిన కొడుకులు చనిపోతే ఆ కుటుంబం మొత్తం శోకసముద్రంలో మునిగిపోయి ఇప్పటికీ వారిని గుర్తు చేసుకుంటూ పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని వీరిని ఆదుకోవడానికి మాదిగ సమాజం ప్రభుత్వం ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్,ఎర్రోళ్ల భూపాల్,కొల్లూరి వెంకట్,నక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



# రాజన్న సేవలో మహారాష్ట్ర భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తులు రద్దీ నెలకొంది. మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు మీడియాతో మాట్లాడుతూ వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి తన సోదరితో కలిసి వచ్చానని, స్వామివారి దర్శనం చాలా బాగా జరిగిందని పేర్కొన్నారు. స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు కోడె మొక్కులతో పాటు తలనీలాలు సమర్పించుకున్నారు.

## అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ భూమి ఇవ్వాలని ఎమ్మార్వోకు వినతి

కరీంనగర్, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

జాతీయ బీసీ సంక్షేమ సంఘం వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు తీగల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మ్యాకల పరుశురాంలు శుక్రవారం వేములవాడ అర్బన్ తహశీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వేములవాడ అర్బన్ ధరణి అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు జిల్లాలోని కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి, ఒక కమిటీ వేసి ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా, అర్హులైన నిరుపేదలకు ఇవ్వవాలని కోరారు.

# మందకృష్ణ మాదిగకు సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



వికారాబాద్ (జై భీమ్ న్యూస్)

ఎస్సీ వర్గీకరణ తెలంగాణ శాసనసభలో అమలు చేసినందుకు గుండాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు పద్మశ్రీ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగకి పాలాభిషేకం చేసిన గుండాల గ్రామస్తులు, గుండాల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు దోమ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల రాఘవేందర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ యాదవ రెడ్డి,దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలి విజయ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల రామచంద్ర రెడ్డి,దోమ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఆర్ బందయ్య (దిర్సంపల్లి) ఎమ్మార్పీఎస్ గ్గుండాల గ్రామ అధ్యక్షులు శీను, ఎమ్మార్పీఎస్ దోమ మండల ప్రధాన కార్యదర్శి దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న వ్యవహారంపై అధిష్ఠానం చూసుకుంటుంది

భువనగిరి, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో టీపీసీసీ కార్యదర్శి పొత్నక్ ప్రమోద్ కుమార్ సతీమణి రోజా చిత్ర పటానికి ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవైస్ చిస్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంటుందన్నారు.

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కోదాడ, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 10న హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు రవీందర్ అన్నారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు.

# కన్నుల పండుగగా రామాలయం శంకుస్థాపన



సత్తుపల్లి, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

సత్తుపల్లి లలిత కుమారి రోడ్డులో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ శంకుస్థాపన మరియు ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమం జయ జయ ధ్వనుల మధ్య కనుల పండుగగా శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మరియు పరిసర ప్రాంతాల ప్రజలు వేలాదిగా పాల్గొని సీతారామ లక్ష్మణ దర్శనం చేసుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఖమ్మం, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

పెనుబల్లి మండలం మండలపాడు గ్రామంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బైక్ పై వెళ్తున్న ఓ యువకుడిని వెనుక నుంచి డీసీఎం వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ప్రయాణిస్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

# బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

మధిర, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం- సువర్ణపురం సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మంకు చెందిన యువకుడు రోజువారి పని నిమిత్తం జగ్గయ్యపేట కు బైక్ పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. రహదారి గుంతలమయంగా ఉండడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్పారు. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

# 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పాలేరు, ఫిబ్రవరి 7(జై భీమ్ న్యూస్):

పెనుబల్లి మండలం లంకపల్లిలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దారా ఉపేందర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 17క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించి ఉపేందర్ పై కేసు నమోదు చేశారు.

# వాటా మాదిగలకు కేటాయించాలన్న మంద కృష్ణ మాదిగ గారి డిమాండ్‌తో పూర్తిగా ఏకీభవిస్తున్నాం

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ**
**ఇది మా జాతి మనోవేదన,మా ఆకాంక్ష..**
**ఎస్సీ వర్గీకరణలో 11శాతం వాటా రావడం మాదిగల న్యాయమైన హక్కు**
**లక్షల డప్పులు- వేల గొంతుల ప్రోగ్రాం రాష్ట్ర కో ఆర్డినేషన్ కమిటీ**
**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి**
**మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్**

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

జనాభా ప్రాతిపదికనను పరిగణలోకి తీసుకున్నా వెనుకబాటు ఆధారంగా తీసుకున్నా ఎలా చూసినా 11% వాటా రావడం న్యాయమే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను స్వాగతిస్తున్నాం... అయితే దానికి కొన్ని సవరణలు చేయాలని కోరుతున్నాం. రిజర్వేషన్ల కేటాయింపులో మరియు వివిధ గ్రూప్ లలో కులాలను చేర్చడంలో కొన్ని లోపాలు జరిగాయి అని మేము భావిస్తున్నాం.. ఆ లోపాలు సరిదిద్దితే లేదా సవరిస్తే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ సంపూర్ణంగా పూర్తి అవుతుంది. ప్రస్తుత ఎస్సీ వర్గీకరణ అసంపూర్ణంగా ఉన్నది. అందువల్లనే మాదిగలు ప్రస్తుత వర్గీకరణ ప్రక్రియ మీద మాదిగలు అసంతృప్తితో ఉన్నారు. గ్రూప్-1 లో ఉన్న కులాలను అత్యంత వెనుకబడిన కులాలుగా గుర్తించి 1% రిజర్వేషన్లను కేటాయింపు. అదే వెనుకబాటు ఆధారంగా మాదిగలకు 11 కల్పించాల్సిందిగా కోరుతున్నాం. రిజర్వేషన్లను అనుభవించడంలో మెరుగైన ఫలితాలు పొందిన మాలలకు జనాబా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించారు. మరి మాదిగలకు రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన ఎందుకు ఇవ్వలేదు...? మెరుగైన ఫలితాలు పొందిన వారి వాటా తగ్గాలి.... నష్టపోయిన వారి వాటా, వెనుకబడిన వారి వాటా పెరగాలి.. కానీ అలా జరగలేదు అందువల్ల ఇందులో శాస్త్రీయత లోపించింది.. వర్గీకరణ లేకపోవడం వల్ల అత్యంత తీవ్రంగా నష్టపోయి బాధితులుగా మిగిలిన వాళ్ళు మాదిగలు...అందుకే వర్గీకరణ కోసం పోరాటం చేశారు... కానీ బాధితులైన మాదిగలకు లబ్దిదారులైన మాలలకు రిజర్వేషన్లను కేటాయించడానికి ప్రామాణికంగా తీసుకున్న జనాభా శాతం సరిగ్గా లేదు.. మాలలకు ఒక శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి 3.50 జనాబా ను పరిగణలోకి తీసుకుంటే, మాదిగలు 3.65 ను పరిగణలోకి తీసుకున్నారు. ఇదేం న్యాయం...? ఈ అన్యాయాన్ని జరిగిన లోపాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్థం చేసుకొని సరిద్దుకోవాలని కోరుతున్నాం. జరిగిన లోపాలను సవరించి అసంపూర్ణంగా వున్న వర్గీకరణ ప్రక్రియను సంపూర్ణంగా మార్చాలని కోరుతున్నాం.. వర్గీకరణ చేయడాన్ని ఆహ్వానిస్తున్నాం... సరైన కేటాయింపులు చేసి న్యాయమైన ముగింపు ఇవ్వాలని కోరుతున్నాం.. అలాగే పంబాల మన్నే కులాలను గ్రూప్-3 లో పెట్టాల్సిందిగా కోరుతున్నాం. ఇది అసంపూర్ణ ఉంది కనుక మాదిగలు అసంతృప్తితో ఉన్నారు.. అందుకే ఏ గ్రామంలో ఒక్క కేక్ ముక్క కట్ కాలేదు, ఏ పల్లెలో ఒక టపాకాయ పేలలేదు. ఏ ఒక్కరి నోటిలో మిఠాయి పడలేదు... మాదిగలు సంబరాలు చేసుకునే విధంగా రాలేదు అనేది నిజం.. మాదిగలకు సంపూర్ణ న్యాయం జరిగలేదనే విషయం రేవంత్ రెడ్డి గారికి కూడా తెలుసు కనుక తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నాం. లక్షల డప్పులు- వేల గొంతుల ప్రోగ్రాం రాష్ట్ర కో ఆర్డినేషన్ కమిటీ. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి -(MRPS) మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ -(MSF).



# సామాన్య ప్రజలకు ఆర్బీఐ గుడ్‌న్యూస్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది దేశంలోని కోట్లాది మంది గృహ రుణ కొనుగోలుదారులకు పెద్ద ఉపశమనం కలిగించింది. ఆర్‌బిఐ ఎంపిసి రెపో రేటును 0.25 శాతం తగ్గింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది దేశంలోని కోట్లాది మంది గృహ రుణ కొనుగోలుదారులకు పెద్ద ఉపశమనం కలిగించింది. ఆర్‌బిఐ ఎంపిసి రెపో రేటును 0.25 శాతం తగ్గింది. ఆ తర్వాత రెపో రేట్లు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దాదాపు 56 నెలల తర్వాత, అంటే మే 2020 తర్వాత =దీ× రెపో రేటును తగ్గించింది. దాదాపు రెండు సంవత్సరాల తరువాత రెపో రేట్లలో ఎటువంటి మార్పు లేదు. ఫిబ్రవరి 2023 నుండి వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పు లేదు. ఇది ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మొదటి ఆర్‌బిఐ ద్రవ్య విధాన సమావేశం. దీనిలో ఆయన తొలిసారిగా సామాన్య ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగించారు. 56 నెలల తర్వాత ఆర్‌బిఐ ఎంపిసి రెపో రేటును తగ్గించింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకారం.. రెపో రేటును 0.25 శాతం తగ్గించారు. ఆ తర్వాత రెపో రేటు 6.25 శాతానికి తగ్గింది. రెపో రేట్ల తగ్గింపు కారణంగా, సామాన్య ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుంది. దేశ ప్రజల రుణ జువీ×, ముఖ్యంగా గృహ రుణ జువీ× తగ్గుతుంది. ఈ వారంలో సామాన్యులకు ఇది రెండవ తీపి కబురు అవుతుంది. కొన్ని రోజుల క్రితం దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వార్షిక ఆదాయం రూ. 12 లక్షలకు పన్ను మినహాయింపు ఇచ్చారు. ఇప్పుడు దేశంలోని గృహ రుణ కొనుగోలుదారులకు పెద్ద ఉపశమనం కలిగిస్తూ, రుణ జువీ× తగ్గించింది. రాబోయే సమావేశాలలో రుణ ఈఎంఐ తగ్గింపు ధోరణి కొనసాగవచ్చు. రుణ ఈఎంఐ తగ్గించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.గత కొన్ని సమావేశాలలో వీూజలోని 6 మంది సభ్యులలో ఒకరు లేదా ఇద్దరు కూడా రెపో రేట్ల తగ్గింపును సమర్థించారు. కానీ మెజారిటీ సభ్యులు రెపో రేటును మార్చకుండా ఉంచడానికి అనుకూలంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి కూడా నిరంతరం ఒత్తిడి పెరుగుతూనే ఉంది. ఆర్‌బిఐ గవర్నర్ పదవీ విరమణ తర్వాత సంజయ్ మల్హోత్రా ఆర్‌బిఐ గవర్నర్ పదవిని చేపట్టినప్పుడు రెపో రేటులో కోత ఉండవచ్చని చాలా మంది భావించారు. గత రెండు సంవత్సరాలుగా వడ్డీ రేట్లు స్తంభింపజేశారు. అందులో ఎటువంటి మార్పు కనిపించలేదు. ఫిబ్రవరి 2023లో రెపో రేటు 0.25 శాతం పెరిగింది. అప్పటి నుండి ఎటువంటి మార్పు లేదు. అంతకు ముందు మే 2022 నుండి వడ్డీ రేట్లు పెరగడం ప్రారంభించాయి.



## ఎస్‌బిఐకి తగ్గిన మొండి బాకీలు




దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అత్యంత ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 84.32 శాతం వృద్ధితో రూ.16,891.44 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.9,164 కోట్ల లాభాలు ఆర్జించింది. అదే సమయంలో రూ.39,816 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ3లో 4.09 శాతం పెరిగి రూ.41,620 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు35 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 2.07 శాతానికి పరిమితమయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 11 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 0.64 శాతం నుంచి 0.53 శాతానికి పరిమితమయ్యాయి. గడిచిన త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.911 కోట్లు కేటాయించింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం నాటి రూ.688 కోట్లతో పోల్చితే కేటాయింపులు పెరిగాయి. బ్యాంక్ మొత్తం ఆదాయం 8.69 శాతం వృద్ధితో రూ.1,28,467 కోట్లకు చేరింది. 2023-24 ఇదే త్రైమాసికంలో రూ.1,18,192.68 కోట్ల ఆదాయం ఆర్జించింది. గడిచిన క్యూ3లో రుణాల జారీలో ఎస్‌బిఐ 13.49 శాతం వృద్ధిని సాధించింది. దీంతో స్థూల రుణాల విలువ రూ.40 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించాయి. ఎస్‌ఎంఇ రుణాల జారీ 18.71 శాతం, వ్యవసాయ రుణాలు 15.31 శాతం, కార్పొరేటల్ రుణాలు 14.86 శాతం, రిటైల్ రుణాల్లో 11.65 శాతం చొప్పున పెరుగుదల నమోదయ్యింది. బ్యాంక్ డిపాజిట్లు 9.81 శాతం పెరిగాయి. అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాల జారీలో రెండంకెల వృద్ధి చోటు చేసుకుందని ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి పేర్కొన్నారు. మ్యూచువల్ ఫండ్ వ్యాపారం పోర్టుపోలియో రూ.10,000 కోట్ల నుంచి రూ.11,000 కోట్లకు మాత్రమే చేరిందన్నారు. ఈ పరిశ్రమలో కొంత ఒత్తిడి నెలకొందన్నారు.

## ఎయిర్‌టెల్‌కు 'టారిఫ్'ల ఫలాలు




ప్రయివేటు టెల్కోలు గతేడాది జులైలో భారీగా పెంచిన టారిఫ్ ఛార్జీలు వాటి ఖజానాను కళకళలాడేలా చేస్తున్నాయి. భారతీ ఎయిర్‌టెల్ 21 శాతం వరకు పెంచిన టారిఫ్‌లతో కంపెనీ లాభాలు బహుళ రెట్లు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో సంస్థ నికర లాభాలు ఐదు రెట్లు పెరిగి రూ.16,134.6 కోట్లకు ఎగిశాయి. 2023-24 ఇదే క్యూ3లో రూ.2,876.4 కోట్ల లాభాలు నమోదు చేసింది. దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు టెల్కోగా ఉన్న ఎయిర్‌టెల్ క్రితం క్యూ3లో 19 శాతం వృద్ధితో రూ.45,129.3 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.37,899 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. టారిఫ్‌ల పెంపునతో సగటు వినియోగదారుడి నుంచి రాబడి (ఎఆర్‌పియు) 17.78 శాతం వృద్ధితో రూ.245కి పెరిగింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.208 ఎఆర్‌పియు నమోదయ్యింది. గురువారం బిఎస్‌ఇలో భారతీ ఎయిర్‌టెల్ షేర్ 2.47 శాతం తగ్గి రూ.1,619.55 వద్ద ముగిసింది.

## ఐటీ దిగ్గజం కీలక నిర్ణయం.. ఉద్యోగులకు బంపర్ ఆఫర్..




ఎంతో మంది ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటారు. కానీ కొన్ని కంపెనీలు తీసుకునే నిర్ణయాలు ఉద్యోగులకు వరంగా మారుతుంది. ఐటీ కంపెనీ అంటేనే ఎన్నో టెన్షన్స్, ఒత్తిడి లాంటివి ఉంటాయి. కొన్ని కంపెనీలు మంచి పనితీరు కనబర్చే ఉద్యోగులకు బంపర్ ఆఫర్‌లు. ఓ ఐటీ కంపెనీ ఉద్యోగులకు కోట్లాది రూపాయలు బోనస్‌లు ప్రకటించి అందరిని ఆశ్చర్యపర్చింది.. కోవై.కో అనే ఐటీ కంపెనీ యాజమాన్యం మూడేళ్లుగా పనిచేస్తున్న 140 మంది ఉద్యోగులను బోనస్‌గా మొత్తం రూ.14.5 కోట్లు ప్రకటించి అందరిని ఆశ్చర్యపరిచింది. ఆ కంపెనీ ప్రధాన కార్యాలయం అవినాశి రోడ్‌లో నవ ఇండియాలో, ఇంగ్లాండ్, చెన్నైలలో బ్రాంచ్ ఆఫీసులను కలిగి ఉంది. ఇందులో దాదాపు 260 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 'కలిసి మనం అభివృద్ధి చెందుతాం' పథకం కింద డిసెంబర్ 31, 2022 కి ముందు కంపెనీలో చేరిన ఉద్యోగులందరికీ మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన తర్వాత వారి మొత్తం వార్షిక జీతంలో 50% బోనస్ లభిస్తుందని ప్రకటించారు. దీని ప్రకారం, మొదటి దశలో 80 మందికి పైగా ఉద్యోగులు తమ జనవరి జీతంతో పాటు బోనస్‌ను అందుకున్నారు. "కంపెనీ వృద్ధికి, లాభదాయకతకు దోహదపడే ఉద్యోగులకు బహుమతులు ఇవ్వడంలో తాను దృఢంగా నమ్ముతానని కంపెనీ జజుూ, వ్యవస్థాపకుడు శరవణకుమార్ అన్నారు. కంపెనీ సంపదను ఉద్యోగులతో పంచుకునే మార్గాలను కనుగొనడం చిరకాల కల అని ఆయన వ్యాఖ్యానించారు. ఉద్యోగులకు రివార్డ్ చేసే మార్గాలను పరిశీలిస్తున్నప్పుడు, తాము మొదట వాటా యాజమాన్య ప్రణాళికలు లేదా వాటా జారీ అవకాశాలను పరిగణించాము. ఉద్యోగులకు నిజమైన ప్రయోజనాలను అందించడానికి, కంపెనీ ప్రజా పెట్టుబడిని పెంచాలి లేదా ప్రజలకు వాటాలను జారీ చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగులకు బోనస్‌లను నగదు రూపంలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మా ఉద్యోగులు దీనిని వారి అవసరాలకు అనుగుణంగా ఉపయోగించవచ్చు. వారు బ్యాంకు రుణాలు చెల్లించడానికి, ఇళ్లపై ముందస్తు చెల్లింపులు చేయడానికి లేదా వారి అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి పెట్టడానికి దీనిని ఉపయోగించవచ్చని శరవణకుమార్ అన్నారు.

## జొమాటో యాప్ పేరు మారనుందా..?

### కంపెనీ తీసుకున్న నిర్ణయం ఏంటి?




జొమాటో ప్రాథమికంగా ఒక ఫుడ్ టెక్ కంపెనీ. అప్పటి నుండి దాని పరిధి విస్తరిస్తూనే ఉంది. అది బ్లింకిట్ అనే క్విక్ కామర్స్ కంపెనీని కొనుగోలు చేసింది. లాజిస్టిక్స్ వ్యాపారం ఉంది. ఈ సందర్భంలో కార్పొరేట్ కంపెనీకి ప్రత్యేక గుర్తింపు అవసరం ఏర్పడింది. జోమాటో.. ఇది అందరి తెలిసిందే. ఏదైనా ఫుడ్ ఆర్డర్ చేయాలన్నా జోమాటోను ఎక్కువగా వినియోగిస్తుంటారు. జోమాటో సేవలు రోజురోజుకు విస్తరిస్తోంది. జోమాటో ఫుడ్ ఆర్డర్లనే కాకుండా ఇటీవల నుంచి ఇతర కిరాణ సరుకులను కూడా డెలివరీ చేస్తోంది. పది నిమిషాల్లోనే డెలివరీ అంటూ తన సేవలను మరింతగా విస్తరించుకుంటోంది జోమాటో. ఇప్పుడు ఈ కంపెనీ పేరు మారింది. జొమాటో లిమిటెడ్‌గా ఉన్న కంపెనీ పేరును ఎటర్నల్ లిమిటెడ్‌గా మార్చారు. పేరు మార్పుకు జొమాటో బోర్డు డైరెక్టర్లు ఆమోదం తెలిపారని కంపెనీ గురువారం దాఖలు చేసిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. జొమాటో కార్పొరేట్ పేరు మారింది. అయితే, కంపెనీ పేరు మారితే జోమాటో పేరును కూడా మారుస్తారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. దీనిపై కంపెనీ క్లారిటీ ఇచ్చింది. కంపెనీ లిమిటెడ్ పేరు మారినప్పటికీ ఫుడ్ యాప్‌లో జోమాటో పేరు అలాగే ఉంటుందని తెలిపింది. అంటే జొమాటో యాప్ పేరులో ఎటువంటి మార్పు ఉండదన్నట్లు. జొమాటో ప్రాథమికంగా ఒక ఫుడ్ టెక్ కంపెనీ. అప్పటి నుండి దాని పరిధి విస్తరిస్తూనే ఉంది. అది బ్లింకిట్ అనే క్విక్ కామర్స్ కంపెనీని కొనుగోలు చేసింది. లాజిస్టిక్స్ వ్యాపారం ఉంది. ఈ సందర్భంలో కార్పొరేట్ కంపెనీకి ప్రత్యేక గుర్తింపు అవసరం ఏర్పడింది. అందువలన పేరు ఎటర్నల్ గా మార్చబడింది. బ్లింకిట్‌ను కొనుగోలు చేసినప్పుడు జొమాటో అంతర్గతంగా 'ఎటర్నల్' గుర్తింపును ఉపయోగిస్తోంది. కంపెనీకి, దాని బ్రాండ్‌కు మధ్య ఒక ప్రత్యేక గుర్తింపును సృష్టించడానికి ఈ మార్పు జరిగినట్లు తెలుస్తోంది. జొమాటో కాకుండా వేరే వ్యాపారం మా భవిష్యత్తుకు కొత్త మార్గాన్ని సుగమం చేస్తోందని చూసిన రోజే, మేము కంపెనీ పేరును ప్రపంచవ్యాప్తంగా ఎటర్నల్‌గా మారుస్తామని ఇప్పటికే నిర్ణయించుకున్నాము. జొమాటో పేరు మార్పును ఇప్పుడు స్టాక్ ఎక్స్ఛేంజీలలో దాని జాబితాలో చూడవచ్చు. జొమాటోకు బదులుగా మీరు ఎటర్నల్ అనే పేరును చూస్తారు. మీరు మీ భోజనాన్ని బుక్ చేసుకోవడానికి ఉపయోగించే శీఏ్ఖశీ యాప్ పేరు, బ్రాండింగ్ అలాగే ఉంటాయి. ఎటర్నల్ సంస్థ కింద నాలుగు వ్యాపారాలు ఉన్నాయి. అవి జొమాటో, బ్లింకిట్, హైపర్‌ప్యూర్, డిస్ట్రిక్ట్. హైపర్‌ప్యూర్ అనేది రెస్టారెంట్లు, కేఫ్‌లు, హొటళ్లకు కూరగాయలు, కిరాణా సామాగ్రి మొదలైన వాటిని టోకు ధరలకు సరఫరా చేసే సర్వీస్. డిస్ట్రిక్ట్ బుక్ మై షో వంటి సేవను అందిస్తుంది. ఇది వివిధ కార్యక్రమాలకు టిక్కెట్లను బుక్ చేసుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది.

## ప్రసంగమంతా ప్రతిపక్షాలపై అభండాలే !



న్యూఢిల్లీ: గురువారం రాజ్యసభలో ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ప్రసంగమంతా ప్రతిపక్షాలపై అభాండాలు వేయానికే కేటాయించారు. దేశంలో సమస్యలను ప్రస్తావించకుండా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. సమాజంలో కాంగ్రెస్ కులమత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం రాజ్యసభలో మోడీ ప్రసంగించారు. నేషన్ ఫస్ట్ తమ విధానమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. 2014 తరువాత దేశం ఒక కొత్త నమూనాను చూసిందని చెప్పారు. కాంగ్రెస్ స్వార్థపూరిత రాజకీయాలు అందరినీ మోసం చేశాయని విమర్శించారు. తాము బాబా సాహెబ్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లి పేదలకు సహాయం చేస్తున్నామని తెలిపారు. అలాగే, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధికి తాము ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. మొదటిసారి వ్యాపారంలోకి వస్తున్న వారికి ముద్ర పథకంతో ఎలాంటి హామీ లేకుండా రుణం ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ప్రభావవంతంగా, భవిష్యత్తు పనుల కోసం మనందరికీ మార్గదర్శకంగా ఉందన్నారు. చరిత్రను పరిశీలిస్తే కాంగ్రెస్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ద్వేషించిందని, ఆయనపై ఎంత కోపంగా ఉందో మనకు తెలుస్తుందని అన్నారు. బాబా సాహెబ్‌ను భారతరత్నకు ఎప్పుడూ అర్హులుగా పరిగణించలేదన్నారు. కానీ ఈ దేశ ప్రజలు బాబా సాహెబ్ భావాలను గౌరవిస్తుండటంతో ఈ సమయంలో కాంగ్రెస్ తప్పక జై భీమ్ అనాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ముంబయిలో కార్మికుల సమ్మె జరిగిందని, అప్పుడు ప్రముఖ గీత రచయిత మజ్రూ సుల్తాన్‌పురి బానిస అనే పాటను పాడారని, దీంతో నెహ్రూ ఆయనను జైల్లో పెట్టారని విమర్శించారు. ప్రముఖ నటుడు బలరాజ్ సాహ్ని ఊరేగింపులో పాల్గొంటే ఆయనను కూడా జైల్లో పెట్టారని పేర్కొన్నారు. లతా మంగేష్కర్ సోదరుడు హృదయనాథ్ మంగేష్కర్ ఆల్ ఇండియా రేడియోలో వీర్ సావర్కర్‌పై ఒక కవిత పఠించాలని అనుకున్నారని, దీంతో ఆయన్ను ఆకాశవాణి నుంచి బహిష్కరించారని తెలిపారు. కాంగ్రెస్ హయంలో దేశం అత్యవసర పరిస్థితిని కూడా చూసిందన్నారు.

## బ్రైట్‌కామ్ గ్రూప్‌నకు సెబీ షాక్

వాటాదారులను నిండా ముంచిన హైదరాబాద్ కంపెనీ బ్రైట్‌కామ్ గ్రూప్ లిమిటెడ్ (బీజీఎల్)కు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ పెద్ద షాకిచ్చింది. ఈ కంపెనీపైన, కంపెనీ ప్రమోటర్లు, ఇతరులపై రూ.34 కోట్ల భారీ జరిమానా విధించింది. ఇందులో కంపెనీ ప్రధాన ప్రమోటర్లు ఎం సురేశ్ కుమార్ రెడ్డి, కంచర్ల విజయ్ చెరో రూ.15 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. దీనికి తోడు వీరిద్దరు ఐదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా వేటు వేసింది. అంతేకాకుండా వీరిద్దరూ ఏ కంపెనీలోగానీ, సెబీ వద్ద నమోదైన సంస్థల్లోగానీ ఐదేళ్ల పాటు కీలక మేనేజ్‌మెంట్ పదవులు చేపట్టకూడదని స్పష్టం చేసింది. దీనికి తోడు కంపెనీ ఇతర డైరెక్టర్లు వై శ్రీనివాస రావుపై రూ.2 కోట్లు, ఎర్రదొడ్డి రమేష్ రెడ్డి, బీజీఎల్‌పై చెరో రూ.కోటి చొప్పున జరిమానా విధించింది. తప్పుడు రికార్డుల ద్వారా లేని టర్నోవర్, లాభాలు ఉన్నట్టు చూపి వీరు కంపెనీ షేర్ల విలువను భారీగా పెంచి, తమ వాటా షేర్లు అమ్ముకుని మదుపరులను నిండా ముంచినట్లు తేలడంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

## 2011 వరల్డ్ కప్‌పై


# సచిన్ కామెంట్స్..

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఇటీవల తన ఆట జీవితంలో




ఆసక్తికరమైన అనుభవాలను పంచుకున్నారు. భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్, ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌లతో తాను కలిగిన అనుభవాలను వెల్లడిస్తూ, సెహ్వాగ్ గురించి ఒక హాస్యాస్పదమైన కథను చెప్పాడు. సెహ్వాగ్ గురించి మాట్లాడుతూ, “అతను ఎప్పుడూ నేను చెప్పినదానికి విరుద్ధంగా చేసేవాడు. నేను అతనిని కొన్నిసార్లు డిఫెన్స్ ఆడమంటే, అతను వెళ్ళి బౌలర్లను ధాటిగా ఎదుర్కొని భారీ షాట్లు ఆడేవాడు. అప్పుడు నేను మెల్లగా అతనికి విరుద్ధంగా చెప్పడం అలవాటుగా మార్చుకున్నాను. నేను చెప్పేది విని, సెహ్వాగ్ తాను చేయాలనుకున్నదే చేసేవాడు.” అలాగే, 2011 ప్రపంచ కప్ ముందు యువరాజ్ సింగ్ కొంత నీరసంగా కనిపించాడని, ఆ సమయంలో అతనికి క్యాన్సర్ ఉన్న సంగతి తెలియదని టెండూల్కర్ గుర్తు చేసుకున్నాడు. “యువీని డిన్నర్‌కు పిలిచి, అతను ఎందుకు నీరసంగా ఉన్నాడని అడిగాను. అతను, ‘పాజీ, నేను బంతిని సరిగ్గా టైమింగ్ చేయడం లేదు’ అన్నాడు. నేను అతనికి బ్యాటింగ్ గురించి మర్చిపోయి ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టమని చెప్పాను. ఆ తర్వాత, అతనిలో మళ్ళీ ఉత్సాహం కనిపించింది” అని సచిన్ వెల్లడించారు. టెండూల్కర్ జట్టుగా ఒకరికొకరు అండగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. “మీరు మంచి ఫామ్‌లో ఉండవచ్చు, మరొకరు లేకపోవచ్చు. లేదా మరొకరు మంచి ఫామ్‌లో ఉంటే, మీరు ఉండకపోవచ్చు. కానీ జట్టుగా మీరు నమ్మకంతో కలిసి ఉండాలి.” న్యూజిలాండ్‌తో టెస్ట్‌లో క్రిస్ కైర్న్స్ బంతిని రివర్స్ స్వింగ్ చేస్తున్న సందర్భాన్ని ఉదహరిస్తూ, “నేను, రాహుల్ ద్రవిడ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు, కైర్న్స్ బంతిని రివర్స్ స్వింగ్ చేసేవాడు. నేల కారణంగా బంతి మెరిసే వైపు కనిపించేది కాదు. అప్పుడు రాహుల్‌తో కలిసి, ‘నేను ఒక చేతిలో బ్యాట్ పెడతాను, నువ్వు బంతి కదలికను అంచనా వేయగలవా?’ అని అడిగాను. మా మధ్య అవగాహనతోనే ఆ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్నాం,” అని చెప్పాడు. సచిన్ ఈ ప్రసంగాన్ని రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చారు, అక్కడ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తన ఆటోగ్రాఫ్‌తో కూడిన భారత టెస్ట్ జెర్సీని అందజేశారు. టెండూల్కర్ తన కుటుంబ సభ్యులు, భార్య అంజలి, కుమార్తె సారాతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ‘కేన్ మామ ఓ ఎమోషన్’..



తెలుగువారు ఎవరినైనా తొందరపడి అభిమానించరు, కానీ ఒకసారి నచ్చితే జీవితాంతం ఆరాధిస్తారు. కేన్ విలియమ్సన్ ఈ ప్రేమను అందుకుని “కేన్ మామ” అనే పేరును గర్వంగా స్వీకరించాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున తన అద్భుత ప్రదర్శనతో, అణకువతో తెలుగు అభిమానుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించాడు. తాజాగా, తన అభిమాన భారతీయులు ఇచ్చిన ఈ పేరు తనకు ఎంతో ఇష్టమని విలియమ్సన్ చెప్పడం క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయింది. అతను జట్టులో లేకున్నా, అభిమానుల గుండెల్లో మాత్రం ఎప్పటికీ “కేన్ మామ”గానే నిలిచిపోతాడు. మన తెలుగువారు ఎవరి విషయంలోనైనా తొందరపడి అభిమానించరు. కానీ ఒకసారి నచ్చితే మాత్రం ఆరాధించడం మొదలుపెడతారు. వారి పేరు ఎత్తితే చాలు, వాళ్లను తమ కుటుంబ సభ్యుల్లానే భావిస్తారు. సినిమా హీరోలు, క్రికెటర్ల విషయంలోనైతే ఈ భావోద్వేగం మరింత ఎక్కువ. ముఖ్యంగా, మన దేశీయ క్రికెటర్ల విషయంలో ఈ విధంగా ప్రేమను ప్రదర్శించడాన్ని తరచూ చూస్తూనే ఉంటాం. అయితే, భారత ఆటగాళ్లే కాకుండా విదేశీ క్రికెటర్లలోనూ మన తెలుగువారు ఎవరినైనా గాఢంగా అభిమానించారంటే, ఆ జాబితాలో ఇద్దరు మాత్రమే ఉంటారు – డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో వీరిద్దరూ ఒక కాలం చక్కని ప్రదర్శన ఇచ్చారు. వారి ఆటతీరు మాత్రమే కాదు, వారు అభిమానులతో కలిసిపోయే తీరు కూడా ప్రత్యేకం. వార్నర్ అయితే తన డాన్స్‌లతో, సోషల్ మీడియా పోస్ట్‌లతో తెలుగు ప్రేక్షకులను అలరించాడు. అయితే కేన్ విలియమ్సన్ విషయంలో మాత్రం ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. తెలుగువారు ప్రేమగా “కేన్ మామ” అని పిలవడం మొదలుపెట్టారు. అది కేవలం పేరుకే పరిమితం కాకుండా, నిజంగా తమ కుటుంబ సభ్యుడిలానే భావించేవారు. తాజాగా, కేన్ విలియమ్సన్ స్వయంగా తన అభిమాన భారతీయుల గురించి మాట్లాడుతూ తనకు “కేన్ మామ” అనే పేరు బాగా నచ్చిందని చెప్పడం విశేషం. ప్రస్తుతం సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో దర్బన్ సూపర్ జెయింట్స్ తరపున ఆడుతున్న విలియమ్సన్, తన సహచర ఆటగాడు హెన్రిచ్ క్లాసిన్‌తో ఓ సరదా చిట్‌చాట్‌లో పాల్గొన్నాడు.

# సోషల్ మీడియాలో చాహల్, ధనశ్రీల విడాకుల పుకార్లు




యుజ్వేంద్ర చాహల్–ధనశ్రీ వర్మ విడాకుల పుకార్లు మరోసారి వైరల్ కాగా, నటి జారా యెస్మిన్ పేరు అనుకోకుండా ఈ వివాదంలోకి వచ్చింది. జారా, చాహల్ తనను ప్రేమించాడన్న గాసిప్‌ను ఖండిస్తూ, తాము కేవలం అవగాహన కార్యక్రమంలో కలిసి పనిచేశామని స్పష్టం చేసింది. చాహల్–ధనశ్రీ మధ్య మనస్పర్థలు ఉన్నాయనే సంకేతాలు కనిపిస్తున్నా, ఇద్దరూ ఇప్పటి వరకు అధికారిక ప్రకటన చేయలేదు. అభిమానులు వీరి భవిష్యత్తు గురించి ఎదురు చూస్తుండగా, సోషల్ మీడియాలో ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది. భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్, ఆయన భార్య ఇంటర్నెట్ ప్రముఖురాలు ధనశ్రీ వర్మ మధ్య విడాకుల పుకార్లు మళ్లీ తెరపైకి వచ్చాయి. గతంలోనే వీరి మధ్య విభేదాలు ఉన్నాయని, విడిపోవడానికి సిద్ధంగా ఉన్నారనే వార్తలు వినిపించినా, ఈసారి మరింత చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ పుకార్ల వెనుక మరో కోణం కూడా ఉంది. అదే నటి జారా యెస్మిన్ పేరు చాహల్‌తో అనుసంధానం చేయడం! చాహల్ తనను ప్రపోజ్ చేశాడంటూ గాసిప్ విస్తరించడంతో జారా యెస్మిన్ చివరకు మౌనం వీడారు. ఆమె స్పష్టం చేసిన ప్రకారం, ఇది పూర్తిగా నిరాధారమైన పుకారు. కోవిడ్–19 లాక్‌డౌన్ సమయంలో, మాస్కులు ధరించడం, ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన కల్పించేందుకు చాహల్‌తో కలిసి ఆమె ఒక ఇన్‌స్టాగ్రామ్ లైవ్ సెషన్ చేశారు. ఆ సమయంలో, చాహల్ సరదాగా “ఎప్పుడైనా పెళ్లి చేసుకుని ఎవరినైనా ఆశ్చర్యపరచగలనని” వ్యాఖ్యానించగా, ఈ మాటలను తప్పుగా అర్థం చేసుకుని, చాహల్ తనను ప్రేమించాడన్న గాసిప్‌లు పుట్టుకొచ్చాయని జారా పేర్కొన్నారు. “ఆ లైవ్ సెషన్ తరువాత చాహల్ ఒక్కోసారి నాకు మెసేజ్ చేసినా, మా మధ్య ఎలాంటి వ్యక్తిగత సంబంధం లేదు. అతను ధనశ్రీని పెళ్లి చేసుకున్నప్పటికీ, అనవసరమైన పుకార్లను నాపై మోపడం బాధాకరం” అని ఆమె అన్నారు. క్రికెట్–డ్యాన్స్ ప్రపంచాల్లో పేరు తెచ్చుకున్న ఈ జంట 2020లో పెళ్లి చేసుకున్నారు. వారి ప్రేమకథ అందరికి ఆదర్శంగా ఉండేది. అయితే, ధనశ్రీ 2022లో తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ నుండి “చాహల్” ఇంటిపేరును తీసివేయడంతో విడాకుల ఊహాగానాలు మొదలయ్యాయి. అప్పట్లో వారు దీనిని ఖండించినా, ఇటీవల మళ్లీ వీరి మధ్య మనస్పర్థలు ఉన్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇటీవల చాహల్–ధనశ్రీ ఒకరినొకరు ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేసుకోవడం, కలిసి ఉన్న ఫోటోలు షేర్ చేయడం మానేయడం, అలాగే చాహల్ పాత జంట ఫోటోలను తొలగించడం వంటి చర్యలు ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చాయి. వీరు నిజంగా విడిపోతారా? లేదా కేవలం తాత్కాలికంగా విభేదాలు వచ్చినాయా? అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది.

## యశస్వి జైస్వాల్ వల్లే విరాట్ కోహ్లీని తొలగించారా ?

నాగ్‌పూర్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభమైంది. ఇందుకోసం, రెండు జట్ల మధ్య టాస్ పడిన వెంటనే, ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఇదిలా ఉండగా, భారత కెప్టెన్ రోహిత్ శర్మ ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నానని చెప్పాడు. ఈ సమయంలో, అతను విరాట్ కోహ్లీని ప్లేయింగ్ ఎలెవన్ నుంచి దూరంగా ఉంచే వార్తను ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ మ్యాచ్‌లో ఆడుతున్న 11 మంది ఆటగాళ్ల గురించి భారత కెప్టెన్ మరో బిగ్ అప్‌డేట్ ఇచ్చాడు. హర్షిత్ రాణా, యశస్వి జైస్వాల్ ఈ మ్యాచ్‌లో వన్డేల్లో అరంగేట్రం చేస్తున్నారని చెప్పాడు. ఇలాంటి పరిస్థితిలో, యశస్వికి అవకాశం ఇవ్వడానికి కోహ్లీని ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తొలగించారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత జట్టు సన్నద్ధం కావడానికి ఇదే చివరి సిరీస్. ఇటువంటి పరిస్థితిలో, టీం ఇండియా తన పూర్తి శక్తితో ఈ సిరీస్‌లోకి ప్రవేశించింది. కానీ, విరాట్ కోహ్లీ లాంటి ఆటగాడిని జట్టు నుంచి దూరం చేయడం ఆశ్చర్యకరం. అయితే, కోహ్లీకి మోకాలి సమస్య ఉందని కెప్టెన్ రోహిత్ శర్మ ప్రకటించాడు. అందుకే అతను ఈ మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. టాస్ సందర్భంగా భారత కెప్టెన్ మాట్లాడుతూ, ‘ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఆడకపోవడం దురదృష్టకరం. అతనికి మోకాలిలో నొప్పిగా ఉంది. అంటే విరాట్ యశస్వి వల్ల కాదు, గాయం వల్లే ఆటకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అయితే, దానిలోని మరో కోణాన్ని మనం పరిశీలిస్తే, కెప్టెన్ రోహిత్ శర్మకు ప్రయోగం చేయడానికి ఇదే చివరి అవకాశం. యశస్వి జైస్వాల్ ఇటీవలి కాలంలో టెస్టులు, టీ20లలో కూడా మంచి ప్రదర్శన ఇచ్చాడు. దీనికి ఇప్పుడు వన్డేలలో కూడా అతనికి ప్రతిఫలం లభించింది. కానీ, అతను ఓపెనర్, అంటే రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా దిగే శుభ్‌మాన్ గిల్‌ను పక్కన పెట్టాల్సి ఉంటుంది. కానీ, గిల్ లాంటి యువ ఆటగాడిని ప్రస్తుతం ప్లేయింగ్ ఎలెవన్ నుంచి దూరంగా ఉంచడం సరైనది కాదు. ఇటువంటి పరిస్థితిలో, కోహ్లీ లేకపోవడం వల్ల, గిల్, జైస్వాల్ కలిసి ఆడగలుగుతున్నారు. కోహ్లీ స్థానంలో గిల్ 3వ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడు.

## యశస్వి జైస్వాల్ వల్లే విరాట్ కోహ్లీని తొలగించారా ?




నాగ్‌పూర్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభమైంది. ఇందుకోసం, రెండు జట్ల మధ్య టాస్ పడిన వెంటనే, ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఇదిలా ఉండగా, భారత కెప్టెన్ రోహిత్ శర్మ ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నానని చెప్పాడు. ఈ సమయంలో, అతను విరాట్ కోహ్లీని ప్లేయింగ్ ఎలెవన్ నుంచి దూరంగా ఉంచే వార్తను ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ మ్యాచ్‌లో ఆడుతున్న 11 మంది ఆటగాళ్ల గురించి భారత కెప్టెన్ మరో బిగ్ అప్‌డేట్ ఇచ్చాడు. హర్షిత్ రాణా, యశస్వి జైస్వాల్ ఈ మ్యాచ్‌లో వన్డేల్లో అరంగేట్రం చేస్తున్నారని చెప్పాడు. ఇలాంటి పరిస్థితిలో, యశస్వికి అవకాశం ఇవ్వడానికి కోహ్లీని ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తొలగించారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత జట్టు సన్నద్ధం కావడానికి ఇదే చివరి సిరీస్. ఇటువంటి పరిస్థితిలో, టీం ఇండియా తన పూర్తి శక్తితో ఈ సిరీస్‌లోకి ప్రవేశించింది. కానీ, విరాట్ కోహ్లీ లాంటి ఆటగాడిని జట్టు నుంచి దూరం చేయడం ఆశ్చర్యకరం. అయితే, కోహ్లీకి మోకాలి సమస్య ఉందని కెప్టెన్ రోహిత్ శర్మ ప్రకటించాడు. అందుకే అతను ఈ మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. టాస్ సందర్భంగా భారత కెప్టెన్ మాట్లాడుతూ, ‘ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఆడకపోవడం దురదృష్టకరం. అతనికి మోకాలిలో నొప్పిగా ఉంది. అంటే విరాట్ యశస్వి వల్ల కాదు, గాయం వల్లే ఆటకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అయితే, దానిలోని మరో కోణాన్ని మనం పరిశీలిస్తే, కెప్టెన్ రోహిత్ శర్మకు ప్రయోగం చేయడానికి ఇదే చివరి అవకాశం. యశస్వి జైస్వాల్ ఇటీవలి కాలంలో టెస్టులు, టీ20లలో కూడా మంచి ప్రదర్శన ఇచ్చాడు. దీనికి ఇప్పుడు వన్డేలలో కూడా అతనికి ప్రతిఫలం లభించింది. కానీ, అతను ఓపెనర్, అంటే రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా దిగే శుభ్‌మాన్ గిల్‌ను పక్కన పెట్టాల్సి ఉంటుంది. కానీ, గిల్ లాంటి యువ ఆటగాడిని ప్రస్తుతం ప్లేయింగ్ ఎలెవన్ నుంచి దూరంగా ఉంచడం సరైనది కాదు. ఇటువంటి పరిస్థితిలో, కోహ్లీ లేకపోవడం వల్ల, గిల్, జైస్వాల్ కలిసి ఆడగలుగుతున్నారు. కోహ్లీ స్థానంలో గిల్ 3వ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడు.

# ఆంధ్రకు ఒకేరోజు మూడు పతకాలు



38వ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు పతకాలు కొల్లగొడుతున్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఒక్కో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు దక్కాయి. ఆంధ్ర కానోయింగ్(వాటర్ స్పోర్ట్స్)లో నాగిడి గాయత్రి బంగారు పతకాన్ని చేజిక్కించుకుంది. 38వ జాతీయ క్రీడల్లో భాగంగా కె–1 స్లాలోమ్ ఈవెంట్‌లో 20ఏళ్ల గాయత్రి పతకాన్ని సాధించింది. కృష్ణాజిల్లా నాగాయలంక గ్రామానికి చెందిన మత్స్యకార కుటుంబానికి చెందిన గాయత్రి చిన్నప్పటినుంచే క్రీడలపట్ల ఆసక్తి కనబర్చేది. తొలుత తైక్వాండో క్రీడపట్ల మక్కువ ఉన్న గాయత్రి ఆ తర్వాత కానోయింగ్‌లో అద్భుత ప్రదర్శనను కనబర్చి జాతీయ క్రీడలకు ఎంపికై బంగారు పతకంతో సత్తా చాటింది. ఇక కాంపౌండ్ మిక్స్‌డ్ టీం ఈవెంట్‌లో తిరుమూరు గణేశ్ మణిరత్నం–సూర్య హంసిని జోడీ రజత పతకం గెలిచింది. ఫైనల్‌లో గణేశ్–సూర్య హంసిని టీమ్ 148–154 పాయింట్ల తేడాతో రిషభ్ యాదవ్–దీప్షిక(హర్యాన) జంట చేతిలో ఓడింది. కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో తిరుమూరు గణేశ్ మణిరత్నం కాంస్య పతకం సంపాదించాడు. వీరికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్విటర్(ఎక్స్)లో శుభాకాంక్షలు తెలిపారు.

## తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం



ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఘన విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్ ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు అక్షర్ పటేల్, శ్రేయస్ అయ్యర్ అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో ఇంగ్లండ్ నిర్దేశించిన 249పరుగుల లక్ష్యాన్ని టీమిండియా కేవలం 38.4 ఓవర్లలోనే ఛేదించింది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (87బీ 96బంతుల్లో 14ఫోర్లు), అక్షర్ పటేల్ (52బీ 47బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్), శ్రేయస్ అయ్యర్ (59బీ 36బంతుల్లో 9ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించగా.. ఓపెనర్లు జైస్వాల్(15), కెప్టెన్ రోహిత్ శర్మ(2) నిరాశపరిచారు. 249 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. జోఫ్రా ఆర్చర్ వేసిన ఐదో ఓవర్లో ఓపెనర్ జైస్వాల్.. కీపర్ సాల్ట్ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్లోనే కెప్టెన్ రోహిత్ శర్మ(2) లివింగ్‌స్టన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అయితే తొలి డౌన్‌లో వచ్చిన శుభ్‌మన్ గిల్ క్రీజులో నిలదొక్కుకున్నాడు. శ్రేయస్ అయ్యర్‌తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. వీరు మూడో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. అర్ధసెంచరీలు పూర్తయ్యాక ప్రమాదకరంగా మారిన ఈ జోడీని బెతెల్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. ఫిల్ సాల్ట్ (43), బెన్ డకెన్ (32) తొలి వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. ఎనిమిదో ఓవర్లలో 75 పరుగులతో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్ ఫిల్ సాల్ట్ రూపంలో తొలి వికెట్ కోల్పోయింది. సాల్ట్ 26 బంతుల్లోనే 43 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత ఓవర్‌లో హర్షిత్ రాణా బౌలింగ్‌లో బెన్ డకెట్(32), హ్యారీ బ్రూక్(0)గా వెనుదిరిగారు. జో రూట్ (19) పర్వాలేదనిపించాడు. కెప్టెన్ జోస్ బట్లర్, జాక్ బెతెల్ ఇన్నింగ్స్‌ను చక్కదిదారు. బట్లర్, జాకబ్ అర్ధసెంచరీలు చేసి పెవిలియన్‌కు చేరారు. చివర్లో జోఫ్రా ఆర్చర్ (21 నాటౌట్) రాణించడం ఇంగ్లండ్ 248 పరుగులు చేసింది. జడేజా, హర్షిత్ రాణాకు మూడేసి, షమీ, అక్షర్, కుల్దీప్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శుభ్‌మన్ గిల్‌కు లభించగా.. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1–0 ఆధిక్యతలో ఉంది. కటక్ వేదికగా రెండో వన్డే ఆదివారం జరగనుంది.

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

## యూత్‌కు పవర్‌ప్యాక్డ్‌గా 'లైలా'



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ 'లైలా'. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైంది. విశ్వక్ సేన్ తొలిసారి ఈ సినిమాలో లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ఈ అంచనాలను మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో టీమ్ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో చాలా గ్రాండియర్‌గా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నా. కచ్చితంగా లైలా మిమ్మల్ని బాగా నవ్విస్తుంది. ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి.. నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నా. ప్రీరిలీజ్ ఈవెంట్ ఉంది కాబట్టి అక్కడ మాట్లాడుతా. లైలా నుంచి నెక్స్ అటక్ పటక్ సాంగ్ రిలీజ్ అవుతుంది. ఆ సాంగ్ నేనే రాశా. అది కూడా మీకు నచ్చుతుంది. నేను ఈ సినిమాలో లేడీ గెటప్ వేసింది ఎంటర్‌టైన్ చేయడానికి. అందులో భాగంగానే కొన్ని డైలాగ్స్ ఉన్నాయి. యూత్‌కు పవర్‌ప్యాక్డ్‌గా సినిమా ఉంటుంది. ఫిబ్రవరి 14న అందరం థియేటర్లలో కలుద్దాం" అని చెప్పారు. డైరెక్టర్ రామ్ నారాయణ్ మాట్లాడుతూ "లైలా సినిమాలో పూర్తిగా ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది"అని తెలిపారు. నటి కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ "ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. అందుకే టీజర్, ట్రైలర్‌లో ఎక్కడా చూపించలేదు. కామాక్షి అంటే చాలా ఇంటెన్స్ రోల్స్ చేస్తుందనే మార్క్ ఉంది. ఆ మార్క్‌కు తగ్గట్లే ఇందులో నా పాత్ర ఉంటుంది. ఆ క్రెడిట్ అంతా డైరెక్టర్ రామ్ నారాయణ్‌దే"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సాహు గారపాటి, డ్యాన్స్ మాస్టర్ భాను పాల్గొన్నారు.

## ప్రేమ, హారర్, కామెడీ అంశాలతో..



మారిశెట్టి అఖిల్ హీరోగా, భానుశ్రీ హీరోయిన్‌గా శ్రీధన్ దర్శకత్వంలో ఎ.కె. టెక్ మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ పతాకంపై మారిశెట్టి శ్రీకాంత్ నిర్మించే నూతన చిత్రం చిత్రీకరణ ప్రారంభమైంది. అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని నిర్మాత సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో చిత్రీకరణ మొదలైంది. టైటిల్ నిర్ణయించాల్సిన ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నిర్మాత నట్టి కుమార్ క్లాప్ నిచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత మారిశెట్టి శ్రీకాంత్ మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ ఐదు రోజులపాటు జరుగుతుంది. ఇందులో భాగంగా ఒక పాట, ఒక ఫైట్ చిత్రీకరణ జరుపుతాం. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితర ప్రదేశాలలో షూటింగ్ చేస్తాం"అని చెప్పారు. దర్శకుడు శ్రీధన్ మాట్లాడుతూ "ప్రేమకథా చిత్రమిది. హారర్, కామెడీ అంశాలతో వైవిధ్యంగా దీనిని మలచబోతున్నాము"అని అన్నారు.

## 'డ్రాగన్'లో ఇద్దరు మలయాళ నటులు



'దేవర' సినిమా తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా 'వార్ 2'. గత కొన్నిరోజులుగా ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. ఆ తర్వాత ఎన్టీఆర్‌తో ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' (పేరు పరిశీలనలో ఉంది)లో సినిమాను తెరకెక్కిస్తున్నారు. కథానాయికగా 'సప్త సాగరాలు దాటి' ఫేమ్ రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. మరో రెండు కీలక పాత్రల కోసం ఇద్దరు మలయాళ నటులను అవకాశం దొరికింది. వీరిలో బిజూమీనన్, టొవినోథామస్‌లు ఉన్నారు. వీరిద్దరూ మలయాళ పరిశ్రమలో ఉత్తమ నటులుగా పేరుంది. తాజాగా టొమినోథామస్..డైరెక్టర్ ప్రశాంత్‌నీల్‌తో కలిసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండ్ అవుతున్నాయి. ఇప్పటికే 'మిన్నల్ మురళి', '2018', 'ఎఆర్ఎం' సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో మంచి పేరు సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మైత్రీ మూవీస్, ఎన్టీఆర్ సంస్థలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'డాగన్' పేరు పరిశీలనలో ఉంది. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడుదల చేయాలని చిత్ర యూనిట్ నిర్ణయించింది.




# తండేల్ టాక్ ఎలా ఉందంటే..!

వరుస ఫ్లాప్స్ తో ఇబ్బంది పడుతున్న అక్కినేని నాగ చైతన్య.. ప్రస్తుతం ఆశలన్నీ తన 23 వ చిత్రం తండేల్ పైనే పెట్టుకున్నాడు. సవ్యసాచి, ప్రేమమ్ చిత్రాల డైరెక్టర్ చందూ మొండేటి డైరెక్షన్లో తెరకెక్కుతున్న ఈ మూవీ లో చైతూకు జోడిగా సాయి పల్లవి నటిస్తుండగా.. గీత ఆర్ట్స్ బ్యానర్ నిర్మిస్తుంది. 2018లో జరిగిన నిజ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా వాలెంటైన్ వీక్ సందర్భంగా ఈరోజు ఫిబ్రవరి 7న గ్రాండ్ గా విడుదలైంది. ఈ సినిమా నుండి ప్రతి సాంగ్ , టీజర్ , ట్రైలర్ ఇలా ప్రతిదీ సినిమాపై అంచనాలు పెంచేయడంతో సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆసక్తి అందరిలో పెరిగింది. మరి ఆ ఆసక్తి తగ్గట్లే సినిమా ఉందా..? చైతు ఎలా చేసాడు..? సాయి పల్లవి తన యాక్టింగ్ తో మరోసారి మాయ చేసిందా..? చందు డైరెక్షన్ ఎలా ఉంది..? అనేది పబ్లిక్ టాక్ లో చూద్దాం. తండేల్ మూవీ ప్రీమియర్స్ ప్రపంచవ్యాప్తంగా ముగిశాయి. ఈ సినిమాకు అన్ని చోట్ల నుంచి పాజిటివ్ రిపోర్టులు వస్తున్నాయి. ఈ మూవీలో సాయిపల్లవి, నాగచైతన్య ఫెర్ఫార్మెన్స్ పీక్స్‌లో ఉంది. చందూ మొండేటి డైరెక్షన్ బాగుంది. సెకండాఫ్‌లో పాకిస్థాన్ ఎపిసోడ్స్ చాలా ఎమోషనల్‌గా ఉన్నాయి అని చెపుతున్నారు. తండేల్ సినిమాలో కీలక పాత్రలు రాజు, సత్య. రాజుగా నాగచైతన్య, సత్యగా సాయిపల్లవి నటించారు. ఈ సినిమా సత్య, రాజుల ప్రేమ కథ. వారిద్దరి మధ్య జరిగిన బలమైన ప్రేమ కథ ఈ సినిమాకు పునాది. పాకిస్థాన్ జైలు, ఇతర ఎమోషనల్ అంశాలు వీరి పాత్రల చుట్టూ అల్లుకున్నాయని అంటున్నారు. ఓవరాల్ గా ఫస్ట్ హాఫ్ పర్వాలేదనిపిస్తుంది.. సెకండాఫ్ అద్భుతంగా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. నాగ చైతన్య, సాయి పల్లవి మరోసారి తమ అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని అంటున్నారు. ఈ సినిమాలో నాగ చైతన్యను చూసి అంతా సర్ ప్రైజ్ అవుతారని.. అంతలా అద్భుతంగా నటించేశాడని అంటున్నారు.

## పోలీసుల విచారణకు హాజరుకానున్న వర్మ..!

శుక్రవారం ఒంగోలు పోలీసుల రామ్ గోపాల్ వర్మ ఎదట హాజరుకానున్నారు. గతంలో ఆయనకు హాజరు కావాలని నోటీసులు ఇస్తే కోర్టుకు వెళ్లి అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. విచారణకు సహకరించారని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు నాలుగో తేదీన హాజరు కావాలని ఆయనకు ఒంగోలు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే తనకు కుదరదని..ఏడో తేదీన అయితే వస్తానని సమాచారం ఇచ్చారు. దానికి పోలీసులు అంగీకరించడంతో శుక్రవారం హాజరు కానున్నారు. తాజాగా ఈనెల 7న విచారణకు రావాలని వాట్సప్ ద్వారా నోటీసులిచ్చిన పోలీసులకు రేపు 11 గంటలకు వస్తానని వర్మ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తుంది. కాగా, చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, పవన్ కల్యాణ్ లను కించపరిచేలా పోస్టులు పెట్టారంటూ వర్మపై గతేడాది ప్రకాశం జిల్లాలో కేసు నమోదైంది. రాంగోపాల్ వర్మ 2023లో వ్యూహం, శపథం అనే రెండు సినిమాలు తశారు. ఆ సినిమా విడుదల సందర్భంగా చంద్రబాబు, పవన్, లోకేశ్‌ల ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టారు. అయితే వారి పరువుకు భంగం కలిగించారంటూ టీడీపీ మద్దిరాలపాడు మండల కార్యదర్శి రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐటి యాక్ట్ కింద రాంగోపాల్‌వర్మపై అదేరోజు నవంబర్ 10న ప్రకాశంజిల్లా మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే గుంటూరు జిల్లా తుళ్లూరు,. అనకాపల్లి జిల్లా రావికమతం పోలీస్ స్టేషన్‌లోనూ రాంగోపాల్ వర్మపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.




## సోనూ సూద్‌పై అరెస్ట్ వారెంట్ జారీ?



బాలీవుడ్ నటుడు సోనూసూద్‌పై పంజాబ్‌లోని లూథియానా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రమణప్రీత్ కౌర్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. క్రిమినల్ కేసులో సాక్షిగా పలుమార్లు సమన్లు పంపినప్పటికీ కోర్టుకు హాజరు కాకపోవడంతో నటుడిపై ఈ వారెంట్ జారీ చేశారు. అసలు ఈ కేసు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా, సినిమాల్లో పవర్ ఫుల్ పాత్రలకు పేరుగాంచిన నటుడు సోనూసూద్ చట్టపరమైన వివాదాల్లో చిక్కుకున్నారు. తాజాగా లూథియానాలోని కోర్టు నటుడిపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. మోసం కేసులో వాంగ్మూలం ఇచ్చేందుకు సోనూసూద్ కోర్టుకు హాజరుకాకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. లూథియానాకు చెందిన రాజేష్ ఖన్నా అనే న్యాయవాది మోసం చేశారని ఆరోపించిన కేసు ఇది. సోనూసూద్ ఫిబ్రవరి 10లోగా కోర్టుకు హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. సోనూసూద్‌పై అరెస్ట్ వారెంట్ ముంబైలోని ఓషివారా పోలీస్ స్టేషన్‌కు పంపారు. నటుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచాలని పోలీసులకు ఆదేశాలు అందాయి. కోర్టు తన ఆర్డర్‌లో.. సోనూ సూద్‌కు సమన్లు వచ్చాయి. కానీ అతను వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించాడు. అందుకే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచాలని ఉంది. ఈ కేసు లూథియానా లాయర్ రాజేష్ ఖన్నాపై వచ్చిన మోసం ఆరోపణలకు సంబంధించినది. మోహిత్ శుక్లా అనే వ్యక్తి తనను రూ.10 లక్షలు మోసం చేశాడని ఖన్నా ఆరోపించారు.

## పవర్‌స్టార్ ముఖ్య అతిథిగా..

'తలసేమియా భాదితుల కోసం ఈ నెల 15న మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసాం. ప్రతి టికెట్ పై వచ్చే రూపాయి తలసేమియా భాదితులకు అందిస్తాం. ప్రేక్షకులు ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ముఖ్య అతిథులుగా రాబోతున్నారు' అని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ అద్వర్యంలో ఈనెల 15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షో జరగనుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో నారా భువనేశ్వరి మాట్లాడుతూ,'జెనిటిక్ డిజార్డర్ తలసేమియాతో చాలా మంది పిల్లలు, పెద్దలు బాధపడుతున్నారు. ఇది తీవ్రంగా వచ్చినప్పుడు రక్త మార్పిడి వెంటనే జరగాలి. దీనికి చాలా రక్తం అవసరం. బ్లడ్ డొనేట్ చేస్తే చాలా మంది జీవితాలు నిలబడతాయి. ఆ బాధితుల కోసం తమన్ కూడా ఒక్క నిమిషం ఆలోచించకుండా వెంటనే మ్యూజికల్ నైట్‌కి వస్తా అన్నారు. అంతేకాదు ఈ షోని ఫ్రీగా చేస్తా అని గొప్ప హృదయంతో చెప్పారు. బుక్ మై షోలో టికెట్స్ అందుబాటులో ఉంటాయి' అని తెలిపారు. 'తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఇటువంటి షోని నిర్వహించడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. చాలా మంచి ఆలోచనతో మొదలైన కార్యక్రమం ఇది. ప్రేక్షకులు టికెట్‌పై పెట్టే ప్రతి రూపాయి తలసేమియా బాధితుల సహాయార్థం వెళ్తుంది' అని సంగీత దర్శకుడు తమన్ చెప్పారు.

